TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక

నమస్తే భారత్ తెలుగు దినపత్రిక NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేధికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 16 | ఎడిటర్ : కందాడి మహెందర్ రెడ్డి | బుధవారం, జూన్,17, 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ

# అవగాహన ఉండాలి

**బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

- ఏఐని మరింతగా వినియోగించాలి
- సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలి
- రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..
- కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..



**హైదరాబాద్,జూన్16,**
ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. ఈరోజు(మంగళవారం) హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

**వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..**

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.




# ‘టెలిగ్రాం’ నిషేధం!

**నీట్ రీ-టెస్ట్‌కు ముందు కేంద్రం సంచలన నిర్ణయం..**

- జూన్ 22 వరకు టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం
- ఎన్‌టీఏ సూచనల మేరకు చర్యలు
- పేపర్ లీక్ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్న ఛానళ్లు
- అభ్యర్థుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్న ముఠాలు
- సైబర్ క్రైమ్ చర్యలు ఫలించకపోవడంతో నిర్ణయం
- పరీక్షల పారదర్శకత కోసమే ఆంక్షలు

**న్యూఢిల్లీ,జూన్16,**
నీట్-యూజీ రీ-టెస్ట్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షకు సంబంధించిన తప్పుడు సమాచారం, నకిలీ ప్రశ్నపత్రాలు, పేపర్ లీక్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు టెలిగ్రామ్ సేవలను జూన్ 22 వరకు తాత్కాలికంగా నిలిపివేసింది. పరీక్షల పారదర్శకతను కాపాడడం, అభ్యర్థులను మోసం చేసే ప్రయత్నాలను అరికట్టడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పలు టెలిగ్రామ్ ఛానళ్లలో నీట్ ప్రశ్నపత్రాలు లీకయ్యాయని ప్రచారం చేస్తూ విద్యార్థులు, వారి కుటుంబాల నుంచి రూ.లక్షలు వసూలు చేసే ముఠాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ గుర్తించింది. ఇలాంటి ప్రకటనలన్నీ పూర్తిగా మోసపూరితమైనవేనని హెచ్చరించారు.



## అమెరికాలో కుప్పకూలిన బీ-52 బాంబర్

- 8 మంది దుర్మరణం
- రాడార్ ఆధునికీకరణ పరీక్షల సమయంలో విషాదం

**ఇంటర్నెట్ న్యూస్,(జూన్16)**
అమెరికా వైమానిక దళంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాలిఫోర్నియాలోని ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో బీదీ-52 స్ట్రాటోఫోర్ట్రెస్ అనే భారీ వ్యూహాత్మక బాంబర్ విమానం కుప్పకూలింది. సోమవారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో విమానంలో ఉన్న ఎనిమిది మంది సిబ్బంది దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటనతో ఎయిర్‌బేస్ పరిసరాలు భయానకంగా మారాయి.రన్‌వే సమీపంలోనే కూలిపోయిన విమానం వెంటనే మంటల్లో చిక్కుకుంది.

ప్రతి ఓటరు పేరు జాబితాలో

# ఉండేలా చూడాలి

**ఓటరు జాబితా సవరణ... బూత్ లెవల్ క్యాడర్ కు మంత్రి సీతక్క దిశానిర్దేశం**

**హైదరాబాద్,జూన్16**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ) ప్రక్రియపై తెలంగాణ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# అమెరికా-ఇరాన్ డీల్ ఎఫెక్ట్

**వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**ఇంటర్నెట్ న్యూస్,(జూన్16)**
అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా లాభాల బాటలో పయనించాయి. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో సూచీలు వరుసగా రెండో రోజు లాభాలతో ముగిశాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 544.15 పాయింట్లు (0.71%) లాభపడి 76,808.48 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 135.25 పాయింట్లు (0.57%)



పెరిగి 23,995 వద్ద ముగిసింది. కీలకమైన 24,000 మార్కుకు కేవలం 5 పాయింట్ల దూరంలో నిలిచిపోయింది.




ఇరాన్ డీల్‌ను తిరస్కరించిన

## ఇజ్రాయెల్

- ఒప్పందాలతో తమకు సంబంధం లేదని స్పష్టీకరణ
- ఇరాన్ అణుబాంబును అడ్డుకుంటామన్న నెతన్యాహు

**ఇంటర్నెట్ న్యూస్,(జూన్16)**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక దౌత్యపరమైన శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణాన్ని ముగించడానికి వాషింగ్టన్-టెహ్రాన్‌ల మధ్య కుదిరిన ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సోమవారం అత్యంత ఘాటైన ప్రకటన చేశారు.

‘దిశ’ ఫెయిల్..

# ‘శక్తి’ సక్సెస్

- ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత
- గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ
- ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి

**అమరావతి,జూన్16,**
ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు.




తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు

# కేటాయించాం

- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

**హైదరాబాద్,జూన్16,**
తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని



పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు.

తెలంగాణపై బాధ్యతారహిత

# వ్యాఖ్యలు సరికాదు

- పవన్‌పై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు.. ఏపీకే పరిమితం కావాలని హితవు
- పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మ అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శ
- ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలపై దృష్టి పెట్టాలని సూచన
- పవన్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల మౌనాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్



**హైదరాబాద్,జూన్16,**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఇక్కడి ప్రజల గురించి పవన్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ఇటువంటి వ్యాఖ్యలను ఎంతమాత్రం సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

# రేపు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్ అంకిత్





**నమస్తే భారత్ భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో** (మూర్తి)రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను జిల్లా కలెక్టర్ అంకిత్ రేపు ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్‌లోనే యూరియా అవసరాన్ని నమోదు చేసి ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని, బుకింగ్ అనంతరం జారీ అయ్యే బుకింగ్ ఐడీ ఆధారంగా సమీప ఎరువుల విక్రయ కేంద్రంలో యూరియాను పొందవచ్చని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంపొందించడంతో పాటు రైతులకు సకాలంలో యూరియా అందించడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు కోరారు.

# తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బంధు యాకయ్య ఎన్నిక

**నమస్తే భారత్ :**-మరిపెడమహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన బంధు యాకయ్య తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు లావుడియా రాములు నాయక్ ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల బలోపేతానికి కృషి చేసే లక్ష్యంతో బంధు యాకయ్యను రాష్ట్ర కమిటీలోకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయన పదవీకాలం ఐదేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బంధు యాకయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.బంధు యాకయ్య రాష్ట్ర స్థాయి పదవికి ఎన్నిక కావడం పట్ల రాంపురం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# మంచినీటి బావులనుశుభ్రంగా ఉంచుకోవాలి

## -బావికి మురామ్మతుల పనులను ప్రారంభిస్తున్న అభినవ్ రెడ్డి

**నమస్తే భారత్ :**-మరిపెడగ్రామంలోని మంచినీటి బావులను శుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలని కాంగ్రెస్ పార్టీ యువ నేత నూకల అభినవరెడ్డి అన్నారు. మంగళవారం మరిపెడ మండలం.పురుషోత్తమాయగూడెం గ్రామంలో మంచినీటి బావి మరమ్మతుల కోసం ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం సీజన్ లో తాగునీరు ఎలాంటి కలుషితం కాకుండా స్థానిక సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బంది తెగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికసర్పంచ్ వెన్నెల నాగరాజు, ఉప సర్పంచ్ దేశెట్టి శ్రీనివాస్, పటేల్ దుర్గయ్య, రాజీల్క శ్రీనివాస్ చారి, మల్యాల శ్యాం, దండగల వెంకన్న, వంగూరి



వెంకన్న,రాజీల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కొక్కరికి లక్ష డాలర్లు..!

## గ్రీన్‌లాండ్ ప్రజలకు ట్రంప్ పెద్ద ఎత్తున ప్రలోభాలు డబ్బు ఎరవేసి దీవిని సొంతం చేసుకునేందుకు ప్రణాళిక

వాషింగ్టన్:గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా గుంజుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. డెన్మార్క్ నుంచి విడిపోయి, అమెరికాతో కలవాలని ఈ దీవి ప్రజలను ఒప్పించాలని యోచిస్తున్నారు.దీనిలో భాగంగా ఇక్కడ నివసిస్తున్న సుమారు 57,000 మందికి భారీగా డబ్బును ఎరగా వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

ఒక్కొక్కరికి10,000 డాలర్లనుంచి 1,00,000 డాలర్ల వరకు (సుమారు రూ.8 లక్షల నుంచి రూ.89 లక్షలు) ఇవ్వజూపేందుకు అధికారులు చర్చించినట్లు తెలిపింది. తూటా తర్వాతే మాట..: ఇదిలావుండగా, ఆర్కిటిక్‌లోని డానిష్ ప్రాంతంపై దాడికి పాల్పడే వారిపై తమ సైనికులు తక్షణమే కాల్పులు జరుపుతారని, ఆ తర్వాత ప్రశ్నలు అడుగుతారని డెన్మార్క్ గురువారం హెచ్చరించింది. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవలసిన అవసరం ఉందని ట్రంప్ పునరుద్ఘాటించిన తర్వాత గ్రీన్‌లాండ్ ప్రధానమంత్రి జెన్స్-ఫ్రెడరిక్ నీల్సన్ ఫేస్‌బుక్‌లో స్పందిస్తూ.. "ఇక చాలు.. కలుపుకోవడం గురించి ఇక ఫాంటసీలు వద్దు" అని ట్రం ప్‌నకు హితవు పలికారు. గ్రీన్‌లాండ్‌పై మోజు ఎందుకు?: అనేక కారణాల వల్ల గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవలసిన అవసరం ఉందని ట్రంప్ చాలా కాలం నుంచి చెప్తున్నారు. ఇక్కడ అడ్వాన్స్‌డ్ మిలిటరీ అప్లికేషన్స్ కోసం అవసరమైన ఖనిజాలు పుష్కలంగా ఉండటం ఒక కారణమని తెలిపారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడంపై ట్రంప్ సహాయకుల మధ్య చర్చలు ఆయన రెండోసారి దేశాధ్యక్ష పదవిని చేపట్టడానికి ముందే ప్రారంభమయ్యాయి. ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అరెస్ట్ చేసిన తర్వాత గ్రీన్‌లాండ్ స్వాధీనం మరింత అత్యవసరంగా మారిందని వైట్ హౌస్ వర్గాలను ఉటంకిస్తూ అమెరికన్ వార్తా సంస్థ తెలిపింది.

ఒక్కొక్కరికీ 1 లక్ష డాలర్లు చెల్లిస్తే, మొత్తం 6 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని, ఇది ఆచరణ సాధ్యమేనని వీరు చెప్తున్నారు.

అమెరికాతో కలవం..: గ్రీన్‌లాండర్స్‌లో అత్యధికులు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నట్లు పోల్స్ చెప్తున్నాయి. డెన్మార్క్ నుంచి విడిపోతే ఆర్థిక వ్యయాలతోపాటు అనేక సమస్యలు ఉంటాయని గ్రీన్‌లాండ్ లెజిస్లేటర్లు ఆందోళన చెందుతున్నారు.

# దువ్వాడ స్థానంలో వాణికే అవకాశం

విజయనగరం,: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేసింది. వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీ ఆయనను దూరం పెట్టింది. అయితే ఆయన తిరిగి వైసీపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అవి వర్కౌట్ అయ్యేలా లేవు. ధర్మాన సోదరులతో పాటు దాదాపు వైయస్సార్ కాంగ్రెస్ నాయకులంతా దువ్వాడ శ్రీనివాసుని వ్యతిరేకిస్తున్నారు. సామాజిక వర్గ కోణంలో చూపి తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేశారు దువ్వాడ. కానీ ఆ ప్రయత్నలేవి వర్కౌట్ కాలేదు. దీనికి తోడు దువ్వాడ శ్రీనివాస్ వాణి ఇప్పుడు వైసీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. తద్వారా దువ్వాడ శ్రీనివాస్ దూకుడుకు ఆమె బ్రేక్ వేసినట్టు కనిపిస్తున్నారు. జిల్లా పార్టీ పెద్దల ప్రోత్సాహంతోనే ఆమె యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన దువ్వాడ శ్రీనివాస్ వైసీపీ పెద్దలపై రగిలిపోతున్నట్లు సమాచారం.దువ్వాడ వాణి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఒక విధంగా వాణి కుటుంబం వల్లే దువ్వాడ శ్రీనివాస్ కు ఆ పేరు వచ్చింది. టెక్కలి ఎంపీపీ తో పాటు జడ్పిటిసి గా కూడా ఉన్నారు వాణి. మొన్నటి ఎన్నికల్లో ఆమెకు ముందుగా టికెట్ ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరి నిమిషంలో దువ్వాడ శ్రీనివాస్ కు ఇచ్చారు. అయితే ఎన్నికల అనంతరం దువ్వాడ కుటుంబంలో రేగిన వివాదం గురించి అందరికీ తెలిసిందే. అప్పట్లోనే వాణి జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దువ్వాడ శ్రీనివాస్ లాంటి వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు. అయితే ఆ నిర్ణయం ఆలస్యంగా తీసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. దువ్వాడ శ్రీనివాస్ పై వేటు వేశారు. అయితే తిరిగి పార్టీలోకి దువ్వాడ చేరుతానని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ధర్మాన సోదరులపై మాత్రం అనుచిత వ్యాఖ్యలు తగ్గించలేదు. ఇటువంటి పరిస్థితుల్లో దువ్వాడ శ్రీనివాస్ కు చెక్ చెప్పేందుకు దువ్వాడ వాణి రంగంలోకి దిగారు.దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు వాణికి అప్పగిస్తారనిఅంత ప్రచారం నడిచింది. కానీ అనూహ్యంగా పేరాడ తిలక్ కు ఇచ్చారు. అయినా సరే దువ్వాడ వాణి జిల్లా వైసీపీ పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు. అయితే టెక్కలిలో కింజరాపు అచ్చెనాయుడుకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిపారని.. దిష్టిబొమ్మనుదహనం చేశారని పోలీసులు పేరాడ తిలక్ ను అరెస్టు చేశారు. ఆ సమయంలో వైసీపీ నేతలు టెక్కలిలో ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదుట వాణి బైఠాయించారు కూడా.

# 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యం




హైదరాబాద్ : తెలంగాణను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ), ఇమేజ్ 2.0 వంటి నూతన విధానాలను అమలు చేస్తోంది. 2025-26 నాటికి రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు, 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి, హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా మార్చనున్నారు. యానిమేషన్, గేమింగ్ రంగాల కోసం ఇమేజ్ 2.0 విధానాన్ని తెస్తూ.. సృజనాత్మక రంగంలో యువతకు ఉపాధి పెంచనున్నారు తెలంగాణను ప్రపంచ ఐటీ రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) పాలసీ, ఇమేజ్ 2.0 విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ఐటీ ఎగుమతులను రూ.3.60 లక్షల కోట్లకు చేర్చడమే కాకుండా.. దాదాపు 11 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ స్థాయి కంపెనీల సీఈఓలతో సమావేశమై హైదరాబాద్‌ను ప్రధాన ఐటీ హబ్‌గా ప్రదర్శించనున్నారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ,డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో పనిచేసే గ్లోబల్ కంపెనీ లను రాష్ట్రానికి తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.వినోద, సాంకేతిక రంగాల కలయికతో 'ఇమేజ్ 2.0' పాలసీని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ రంగమే కాకుండా యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్ (ఎఈసీ) విభాగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తుంది. దీనివల్ల కళాత్మక నైపుణ్యం ఉన్న యువతకు హై-స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయి. మెటావర్స్, డిజిటల్ కంటెంట్ తయారీలో మరిన్ని స్టార్టప్‌లు వచ్చేలా రాయితీలు కల్పించను న్నారు. కొత్త విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పరిశ్రమల నుంచి నేరుగా నిపుణులను కన్సల్టెంట్లుగా నియమిం చుకోవా లని నిర్ణయించింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న నైపుణ్య లోటును భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అం తర్జాతీయ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి.. పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా ఆమోదించడానికి ఈ నిపుణుల బృందం పని చేస్తుంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ కేవలం సేవల రంగంలోనే కాకుండా.. పరిశోధన మరియు అభివృద్ధి ) విభాగాల్లోనూ అగ్రగామిగా నిలవనుంది. మిషన్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతోపాటు.. అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఈ సరికొత్త ఐటీ పాలసీలు కీలకం కానున్నాయి.

# పురుషుల కంటే ఉద్యోగ అవకాశాలు భారీగా కోల్పోనున్న భారత మహిళలు




హెచ్ -1 బివీసా లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడనుంది. మిగతా దేశాల మాట అటుంచితే.. ముఖ్యంగా భారత్ యువత ఉపాధిపై కోలుకోలేని దెబ్బ పడింది. మరీ ముఖ్యంగా మహిళల పరిస్థితి అగమ్యగోచరమైంది. మగవారికంటే ఎక్కువ చదువుకున్నా.. ఉద్యోగాల విషయంలో కంపెనీలు మగవారికే మొగ్గు చూపుతున్నాయి. దీంతో అమెరికాలో మహిళల ఉపాధి అవకాశాలు బాగా తగ్గే అవకాశం ఉందని పలు సర్వేలు వెల్లడించాయి.

ఉదాహరణకు హెచ్-1బి వీసా ద్వారా గతేడాది అమెరికు వెళ్లిన కార్మికుల్లో ఉద్యోగాలు కొనసాగించడానికి అవకాశం ఉన్న కార్మికుల్లో 74శాతం మంది పురుషులు ఉంటే.. 26 శాతం మంది మాత్రమే మహిళలున్నారు. ఇక జీతాల విషయానికొస్తే.. స్త్రీ-పురుష జీతాల్లో చాలా వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు 2024 సంవత్సరం ప్రకారం చూస్తే.. ప్రారంభంలో కొద్దినెలల ఉద్యోగానికి (బోటమ్ క్వార్టర్ 25 శాతం)) మహిళల జీతం 77వేల డాలర్లు. అదే పురుషులకైతే 1,02,000 డాలర్లు. ఇక మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలకు 97వేల డాలర్లు, పురుషులకు 1,32,000 డాలర్లు. టాప్ క్వార్టర్ (75 శాతం) మహిళలకు 1,30,000 డాలర్లు, పురుషులకు 1,69,000 డాలర్లు సంపాదిస్తున్నారు. చదువు అయిపోగానే ఉద్యోగం చేసే మహిళలు, పురుషుల జీతాల్లో కూడాజీతాల వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది.

బోటమ్ క్వార్టర్ (25 శాతం) 71,000, పురుషులకు 80,000 డాలర్లు. మిడిల్ వర్కర్ (50 శాతం) మహిళలు 91,000 డాలర్లు, పురుషులు 99,000 డాలర్లు. ఇక టాప్ క్వార్టర్ అయితే మహిళలకు 1,25,000 డాలర్లు. పురుషులకు 1,31,000 డాలర్లు సంపాదిస్తున్నారు. పురుషుల కంటే.. మహిళలు చాలా తక్కువ జీతంతోనే పనిచేస్తున్నారు.

అమెరికాకు వెళ్లి ఉద్యోగం చేయాలని పురుషుల కంటే..

మహిళలే ఎక్కువ శాతం ఉంది ఉన్నారు. 35ఏళ్లలోపు మహిళలు 75శాతం మ ంది ఉంటే పురుషులు 65 శాతం మందే ఉద్యోగానికి మొ గ్గుచూపడం గమనార్హం.

## ఇంధన ధరలు తగ్గాలంటే కార్లు తక్కువగా వాడండి

# అమెరికన్లకు షెవ్రాన్ అధికారి సలహా



**- డబ్బు ఆదా చేసుకోవాలంటే ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలని వ్యాఖ్య**

**- హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ఇంధన ధరలు**

**- జలసంధిని పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించిన అధ్యక్షుడు ట్రంప్**

**- ఈ నెల 22తో ముగియనున్న అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం**

ఢిల్లీ,:అమెరికా-ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో గ్యాస్ ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రముఖ చమురు సంస్థ షెవ్రాన్ ఎగ్జిక్యూటివ్ ఆండీ వాల్జ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. పెరిగిన ధరల నుంచి ఉపశమనం పొందాలంటే ప్రజలు తమ వాహనాలను తక్కువగా వాడాలని, ఇంధనాన్ని పొదుపు చేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. సీబీఎస్ న్యూస్‌తో మాట్లాడుతూ... "ప్రజలు డ్రైవింగ్ తగ్గించుకోవాలి. ఇంధనాన్ని పొదుపు చేసేందుకు ప్రయత్నించాలి. నిజానికి మనం ఎప్పుడూ ఇలాగే చేయాలి. ఇంధనం ప్రజల జీవితాలకు అత్యవసరం. దానిని మనం పొదుపుగా వాడుకోవాలి" అని వాల్జ్ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ సముద్ర మార్గ చమురు, సహజవాయువు రవాణాలో దాదాపు 20 శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని తన అధీనంలోకి తీసుకోవడంతో గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురుపై ఆధారపడిన అనేక దేశాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. దీని ప్రభావంతో అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ అంశంపై వాల్జ్ వివరిస్తూ... "ఇది అంతర్జాతీయ మార్కెట్ సమస్య. కేవలం అమెరికన్ల కోసం ధరలను తగ్గించడానికి తక్షణమే అద్భుత పరిష్కారాలేవీ లేవు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత కఠినంగా ఉంటుంది" అని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలమవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్ జలసంధిపై సంచలన నిర్ణయం తీసుకున్నారు. "ప్రపంచంలోనే అత్యుత్తమమైన మా నౌకాదళం, హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే లేదా బయటకు వెళ్లే అన్ని నౌకలను తక్షణమే దిగ్బంధిస్తుంది" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ వైఖరి మారే వరకు ఈ దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 22తో ముగియనుంది.

# కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

## బాధితులను పరామర్శించిన కలెక్టర్ సిరి

కర్నూలు: కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను జిల్లా కలెక్టర్ సిరి పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడి.. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందిన నలుగురు క్షతగాత్రులు డిశార్చ్ అయ్యారన్నారు. మిగిలిన వారు.. కర్నూలు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు.

# సంపాదకీయం

## భారత్ బిగ్ డీల్..!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. తన ఏడాది పాలనలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ కాలం వెల్లదీశాడు. మిత్రులు, శత్రువు అనే తేడా లేకుండా 5 నుంచి 200 శాతం వరకు టారిఫ్‌లు విధించారు. దీంతో ప్రపంచంలో చాలా దేశాలు ఈ టారిఫ్‌ల కారణంగా ఇబ్బంది పడుతున్నాయి. చాలా మంది ఉపాధి కోల్పోయారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో చాలా కంపెనీలు ఉత్పత్తి తగ్గించాయి. ఉద్యోగులను తగ్గించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, సౌత్ ఆఫ్రికాతోపాటు అనేక చిన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా అమెరికాకు సన్నిహితంగా ఉండే యురోపియన్ యూనియన్‌ను మోదీ తన బుట్టలో వేసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడు మాటను లెక్క చేయకుండా ఈయూ భారత్‌తో అతిపెద్ద వాణిజ్య ఒప్పందానికి సిద్ధమైంది. భారత్?యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌ఏటీ) ద్వారా లక్షలాది మందికి పెద్ద అవకాశాలు లభిస్తాయని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వ్యాపారంలో మూడింట ఒక భాగాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఇండియా ఎనర్జీ వీక్ (ఐఈడబ్ల్యూ) నాల్గవ సంప్రదింపు ప్రారంభ సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఇంధన రంగంలో డిమాండ్ ఊపందుకుంటోందని, ఈ ఒప్పందం ద్వారా పెద్ద స్థాయి పెట్టుబడులు ఆకర్షిస్తామని చెప్పారు. ఇది ఉమ్మడి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తూ, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను పెంచుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాస్తవానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో జరగాల్సింది. కానీ అమెరికా కోసం మన దేశ రైతులను పణంగా పెట్టేందుకు మోదీ అంగీకరించడం లేదు. అనేక అంశాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. దీంతో వాణిజ్య చర్చలు నెలల తరబడి సాగుతున్నాయి. దీంతో భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం తగ్గించేందు మోదీ ఒక అడుగు ముందుకు వేసి ప్రపంచ దేశాలతో చర్చలు ప్రారంభించారు. ఒప్పందాలూ చేసుకుంటున్నారు. భారత్?ఈయూ ఒప్పందం కూడా ఇందులో భాగమే. అయితే దీనిని చూసి ఇప్పుడు అమెరికా కుళ్లుకుంటోంది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్, తమ దేశం రష్యా?ఉక్రెయిన్ సంఘర్షణను అరికట్టేందుకు ఎక్కువ రాజీలు చేసుకున్నామని, భారత్‌పై చమురు దిగుమతులకు అదనపు పన్నులు విధించామని గుర్తు చేశారు. అయినా ఈయూతో భారత్ సులభంగా ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించార. తమ సహకారానికి తగిన గుర్తింపు లభించలేదని ఆక్షేపించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య పోటీతత్వాన్ని, భౌగోళిక రాజకీయాల ప్రభావాన్ని సూచిస్తోంది. ఈ ఒప్పందం ఈయూ? భారత్‌కు యూరప్ మార్కెట్లలో సులభ ప్రవేశం అందిస్తూ, ఎక్స్‌పోర్ట్‌లను పెంచుతుంది. ఇంధన, ఆటో, టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరిగి, ఆర్థిక వేగాన్ని పెంచవచ్చు. అయితే, అమెరికా విమర్శలు భవిష్యత్ వాణిజ్య ఒప్పందాల్లో టెన్షన్లను సృష్టించవచ్చు. రష్యా చమురు విషయంలో భారత్ స్వతంత్ర విధానం కొనసాగితే, యూఎస్‌తో సంబంధాలు బలపడే అవకాశం ఉంది. మొత్తంగా, ఈ డెవలప్‌మెంట్ భారత్ గ్లోబల్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి సహాయపడుతుంది, ఇతర దేశాలు కూడా భారత్‌వైపు చూసేలా చేస్తుంది. మరో వైపు యూరప్‌లో తయారైన కార్లు (జెర్మన్, ఇటాలియన్ మోడల్స్) ధరలు 20?30% వరకు దిగవచ్చు. ఆలివ్ ఆయిల్, కివీ పండ్లు వంటి ఆహార పదార్థాలు, విస్కీ, వోడ్కా, బీర్, వైన్ లాంటి పానీయాలు, సిద్ధంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ ఐటెమ్స్, పండ్ల రసాలు అందరికీ చౌక అవుతాయి. ఇలాంటి మార్పు ద్వారా మధ్యతరగతి కుటుంబాల ఖర్చులు తగ్గి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువుల్లో 90 శాతానికిపైగా యూరోపియన్ మార్కెట్లలో సుంకాలు ఉండవు. టెక్స్‌టైల్స్ రంగం (కాటన్ గార్మెంట్స్, సారీలు, హ్యాండ్‌లూమ్) పెద్దగా ప్రయోజనం పొందుతుంది, ఇటలీ, ఫ్రాన్స్ మార్కెట్లలో డిమాండ్ పెరుగుతుంది. కెమికల్స్ (ఫార్మా ఇంటర్మీడియేట్స్, పెస్ట్‌సైడ్స్) రంగం జర్మనీ, బెల్జియం వర్క్‌షాప్‌లకు సులభ ప్రవేశం పొందుతుంది. ఆభరణాలు (గోల్డ్, డైమండ్ జ్యువెలరీ) స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో ఎగుమతులు దాదాపు రెట్టింపు అవుతాయని అంచనా. ఇవి లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఎంఎస్ఎంఈలకు బూస్ట్ ఇస్తాయి. మొత్తం వాణిజ్యం వృద్ధి చెంది, జీడీపీ 1 నుంచి 2 శాతం వృద్ధికి దోహదపడవచ్చు. ఈ ఒప్పందం రెండు ప్రాంతాల మధ్య పరస్పర పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. యూరప్ నుంచి టెక్నాలజీ, మెషినరీ దిగుమతులు పెరిగి, భారత పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. భారత్ నుంచి ఐటీ, ఆటో పార్ట్స్ ఎగుమతులు పెరిగి, సరఫరా బలపడుతుంది. అయితే, స్థానిక ఉత్పాదకులు పోటీకి సిద్ధంగా ఉండాలి. మొత్తంగా, ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌ను గ్లోబల్ ట్రేడ్ హబ్‌గా మార్చి, మధ్య తరగతి ఆదాయాలను పెంచుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహం గురించి అందరికీ తెలిసిందే. ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు భారత ప్రధాని మోదీతో మంచి స్నేహ సంబంధాలను నెరిపారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ట్రంప్ అసలు స్వరూపం బయటకు రావడం మొదలైంది. ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. భారత్ ఖండించినప్పటికీ అమెరికా అధ్యక్షుడి తీరు మారలేదు. అంతే కాదు పాకిస్థాన్‌తో దోస్తీ చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు ట్రంప్. అంతే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థను డెడ్ ఎకానమి అంటూ ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ మాట వినకపోతే భారత్‌కు భవిష్యత్తు లేదనేది ట్రంప్ మాటల ఉద్దేశంగత ఏడాది యూకేతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న భారత్.. న్యూజిలాండ్‌తోనూ ట్రేడ్ డీల్ చేసుకుంది. ఒమన్‌తో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు యూరోపియన్ యూనియన్‌తో ఏకంగా మదర్ ఆఫ్ డీల్స్‌గా చెప్పుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్ట్రేలియా, కెనడా, చిలీ లాంటి దేశాలతోనూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి భారత్ చర్చలు జరుపుతోంది. తద్వారా అమెరికాకు ప్రత్యామ్నాయ మార్కెట్లు లభించడంతోపాటు.. మనకు అవసరమైన వనరులను ఈ దేశాల నుంచి పొందడానికి అవకాశం కలగనుంది. ట్రంప్ వైఖరి వల్ల భారత్‌తోపాటు యూరప్ దేశాలు సైతం విసిగిపోయాయి. అమెరికా పొరుగు ఉన్న కెనడాకు సైతం అగ్రరాజ్యం తీరు ఏమాత్రం నచ్చడం లేదు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలబెడతామని టారిఫ్ వార్ మొదలుపెట్టిన ట్రంప్.. ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో అమెరికా తీరుతో విసిగిపోయిన దేశాలు.. బహుళ ధ్రువ ప్రపంచం దిశగా వేగంగా అడుగులేస్తున్నాయి.

# బహుళ ప్రయోజనాల ఒప్పందం!

ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచం అల్లకల్లోలం అవుతున్నది. అంతేగాకుండా సామ్రాజ్య విస్తరణ కాంక్ష పెరుగు తోంది. సొంతదేశం అమెరికాలోనే ట్రంప్ పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఓ వైపు టారిఫ్‌లు మరోవైపు వీసాల కట్టడితో భారత్ లక్ష్యంగా ట్రంప్ పరోక్ష యుద్ధం మొదలు పెట్టాడు. ఒకవైపు ట్రంప్ టారిఫ్‌ల దూకుడు, మరోవైపు చైనా ఆధిపత్యం, కీలక ఉత్పత్తుల సరఫరాలపై నియంత్రణలతో ప్రపంచ వాణిజ్యంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈయూ–భారత్ ఒప్పందంతో అటు అమెరికా దూకుడుకు అడ్డుకట్ట వేయడం, ఇటు చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడం సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య ఒప్పందంపై 2007లో చర్చలు మొదలయ్యాయి. వివిధ కారణాలతో మధ్యలో నిలిచిపోయాయి. అంటే గత యూపిఏ హయాంలోనే ఈ ప్రక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పుకోవాలి. తిరిగి 2022లో చర్చలు ప్రారంభమయ్యాయి. మొత్తంగా రెండు దశాబ్దాల అనంతరం ఒప్పందం కుదిరింది. గ్రీన్‌లాండ్ అంశంలో ట్రంప్ వ్యవహారశైలి, అమెరికా లేకుంటే యూర్‌పను ఎవరూ పట్టించుకోబోరన్న వ్యాఖ్యలు, టారిఫ్ విధిస్తానంటూ బెదిరించడం తో.. ఆగ్రహంతో ఉన్న ఈయూ భారత్‌తో ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసింది. ఈక్రమంలో భారత్ ఆచితూచి మసలు కుంటోంది. ప్రపంచ దేశాలతో సయోధ్యకు యత్నిస్తోంది. కొందు చెప్పినట్లుగా అమెరికాను ఎదరించడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదు. ఎందుకంటే మన వాణిజ్యానికి తోడు, మన దేశీయులు లక్షల్లో అక్కడ ఉన్నారు. వారి ప్రయోజనాలు కూడా ముఖ్యం. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మోడీని విమర్శించడమే లక్ష్యంగా మన విదేశాంగ విధానంపై దుమ్ము పోస్తున్నారు. కానీ ఇది సరైన విషయం కాదు. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎడారిలో ఒయాసిస్సు లాంటిది. వాణిజ్యం కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, ఇతర మార్కెట్లను అందిపుచ్చు కోవడం దిశగా భారత్ ముందడుగు వేస్తున్న క్రమంలో కొత్తవాణిజ్య ఒప్పందం ఓ పెద్ద ముందడుగా భావించాలి. యూరప్ దేశాలకు ఎగుమతి చేసే చాలా రకాల ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా తొలగి పోనున్నాయి. దీనితో భారత వ్యాపారులు, ఎగుమతిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలగనుంది. యూరప్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే కార్లు, వైన్స్, అత్యవసర ఔషధాలు వంటి వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. యూరోపియన్ యూనియన్,భారత్ మధ్య భారీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' గా అభివర్ణించవచ్చు. ఇటు భారత్‌లోని 140 కోట్ల మంది, ఈయూలోని కోట్లాది మంది ప్రజలకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. భారత్, ఈయూ ఉమ్మడి జీడీపీ ప్రపంచ జీడీపీలో 25శాతం. ఇది ప్రపంచ వాణిజ్యంలో మూడోవంతుతో సమానం అనిప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన 27 దేశాల్లో ఈ ఒప్పందంపై చట్టాలుచేసిన త ర్వాత పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఇందు కోసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, భారత్–ఈయూ సదస్సులో భాగంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియా కోస్టాలతో ప్రధాని మోదీ భేటీ అయి.. వాణిజ్యంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తోపాటు మొత్తం 13 అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వచ్చే ఐదేళ్లకు సంబంధించిన ఉమ్మడి వ్యూహాత్మక ఎజెండాను ఆమోదించారు. నిజానికి ఇదో పెద్ద ముందడుగుగా భావించాలి. భారత్ వేస్తున్న అడుగులను ట్రంప్ కూడా గమనిస్తున్నారు. బెదిరింపు ధోరణులతో భారత్‌ను కట్టడి చేయడం సాధ్యంకాదని ఈ ఒప్పందంతో అర్థం కానుంది. ముఖ్యంగా భారత్ వస్తువులకు మార్కెట్ అవసరం. అది ఇప్పుడు కొంత తీరనుంది. 2030 నాటికి భారత్, ఈయూ మధ్య వాణి జ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ బలోపేతం చేసేందుకు.. ఉమ్మడి సమగ్ర, వ్యూహాత్మక ఎజెండాను అనుసరించాలని నిర్ణయించారు. ఇది యూరప్ దేశాల్లో భారత యువత ఉద్యోగాలు,విద్య, పరిశోధన రంగాల్లో మంచి అవకాశాలు పొందేందుకు కూడా తోడ్పడనుందని విశ్లేషణలు వస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం పొడిగింపు, గ్రీన్ హైడ్రోజన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, రహస్య సమాచారం పరస్పర మార్పిడి ఒప్పందంపై చర్చలు చేపట్టడంపైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా కార్ల దిగుమతిపై భారత్ యూరోపియన్ యూనియన్‌పై ఆధారపడుతోంది. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కార్లపై ప్రస్తుతం 125శాతం వరకు సుంకాలు ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం కార్లపై సుంకాలు 40శాతానికి తగ్గుతాయి. తర్వాత దశలవారీగా 10శాతానికి తగ్గిస్తారు. దీనితో యూర్‌పకు చెందిన బీఎండబ్ల్యూ, ఆడి, మెర్సిడెజ్, లాంబోర్గిని, పోర్షే వంటి కార్ల ధరలు భారీగా తగ్గుతాయి. మరోవైపు భారత్ నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేసేకార్లపైనా అక్కడి సుంకాలను10శాతానికి తగ్గిస్తారు. ఇది భారత కంపెనీలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఇలా పరస్పరం సుంకాల మినహాయింపు వల్ల మన ఉత్పత్తుకు కూడా ఎగుమతి మార్కెట్ లభిస్తుంది. ఇకపోతేయూరప్ దేశాల నుంచి భారత్‌కు వచ్చే వైన్, విస్కీ,వోడ్కా,బీర్ వంటివాటిపై 150శాతంవరకు దిగుమతి సుంకాలుఉన్నాయి. క్యాన్సర్ ఔషధాలు,బరువు తగ్గించే మందులు సహాకీలక ఫార్మా ఉత్పత్తుల ధరలు 11 శాతం వరకు, వైద్య పరికరాలు ధరలు 25శాతం వరకు తగ్గుతాయి. మందుల తయారీకి వాడే ముడి పదార్థాల ధరలు తగ్గడం వల్ల దేశంలో ఫార్మా కంపెనీలకు ప్రయోజనం కలగనుంది. విమానాలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై భారత సుంకాలు తగ్గుతాయి. దీనితో యూరప్ నుంచి వచ్చే సంబంధిత ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. ఇక భారత్ నుంచి యూరప్ దేశాలకు వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, ఆభరణాల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి. బిస్కట్లు, పాస్తా,చాకోలెట్లు, పండ్ల రసాలు వంటి ప్రాసెస్డ్ ఉత్పత్తులు, ఆలివ్ ఆయిల్, ఇతర నూనెలపై సుంకాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. నిజానికి ఇదో పెద్ద విజయంగా, కీలక పరిణామంగా చూడాలి. ప్రపంచంతో పోటీపడి మన ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల బెడద నుంచి ఉపశమనానికి ఈ ఒప్పందం కీలకం కానుందనడంలో సందేహం లేదు.

# మైక్రోప్లాస్టిక్‌తో త్వరగా వృద్ధాప్యం ..!



**ఆరోగ్యం : మైక్రోప్లాస్టిక్ పర్యావరణానికే కాదు, మనిషి ఆరోగ్యానికి కూడా పెను ప్రమాదంగా మారింది. మీకు తెలుసా ? గుండెపోటుకు మైక్రోప్లాస్టిక్‌కు సంబంధం ఉంది..! అంతేకాదు.. మనిషిని త్వరగా వృద్ధాప్యంలోకి తీసుకెళుతుంది..!**

మైక్రోప్లాస్టిక్ అంటే ?: మైక్రోప్లాస్టిక్ అంటే చిన్న ప్లాస్టిక్ ముక్కలు.. దాని పొడవు 5 మిల్లీ.మీటర్ల కన్నా తక్కువ..! ఇది మన పర్యావరణంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ఫలితం..! మేకప్ ఐటమ్స్, ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ బ్యాగులు, సింథటిక్ వస్త్రాలలో మైక్రోప్లాస్టిక్స్ ఉంటాయి. ఇవన్నీ మనం పారేసే చెత్త ద్వారా ప్రయాణించి పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి.

ప్రైమరీ, సెకండరీ : ఈ అతిచిన్న ప్లాస్టిక్ ముక్కలు ప్రైమరీ, సెకండరీలుగా విభజింపబడ్డాయి. ప్రైమరీ మైక్రో ప్లాస్టిక్స్ ఉద్దేశపూర్వకంగా తయారయ్యాయి. వీటిని వేరే వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. బట్టలు, టైర్లు, మేకప్‌ల తయారీలలో వాడతారు. ఇక సెకండరీ మైక్రో ప్లాస్టిక్స్.. అత్యధికంగా మనకు కనిపిస్తాయి. పెద్దగా ఉండే ప్లాస్టిక్‌లు, ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ కుర్చీలు, ఫర్నీచర్ సామాగ్రిని తయారు చేయడానికి వాడతారు. వీటిని సరిగ్గా పారేయకపోతే.. సూర్యకాంతి, ఆక్సిజన్‌లు కలిసి ప్లాస్టిక్‌ను బలహీనం చేస్తాయి. అవి చిన్నచిన్నవిగా విడిపోయి మైక్రో ప్లాస్టిక్‌గా మారతాయి. వీటిని సెకండరీ మైక్రో ప్లాస్టిక్ అంటారు. ప్లాస్టిక్ డీకంపోజ్‌కు 100 సంవత్సరాలు పడుతుందని మనం తరచుగా వింటుంటాం. అయితే ఈ ప్లాస్టిక్ మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. జీర్ణాశయం పేగులలో చేరడం, టాక్సిక్ కెమికల్స్‌ను మన జీర్ణాశయంలో పంపడం, కణాలను దెబ్బతీయడం, మైక్రో బాక్టీరియా అంతరాయం, ఊపిరితిత్తుల సమస్యలు, బ్లడ్, బ్రెయిన్, నరాల సమస్యలు వస్తాయి. అందువల్ల ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం చాలా కీలకం. అవసరం.


వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తున్నాయి: శరీరంలోని ధమనుల నుంచి మెదడు, చివరికి పిండం వరకు చేరిన ఈ చిన్న కాలుష్య కణాలు, కణాలపై ఒత్తిడి పెంచి, అవయవాల పనితీరును దెబ్బతీసి, జీవసంబంధిత వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తున్నాయని ఒక డాక్టర్ తన వీడియోలో హెచ్చరించారు. మైక్రోప్లాస్టిక్స్.. ఈ చిన్న కణాలు కేవలం పర్యావరణంలో కాలుష్యంగా మిగిలిపోవడం లేదు. అవి మనిషి శరీరంలోకి సైతం చొరబడి ఆరోగ్యంపై, జీవితకాలంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయనే ఆందోళన పెరుగుతోంది. ప్లాస్టిక్ విచ్ఛిన్నం అయినప్పుడు ఏర్పడే ఈ సూక్ష్మ కాలుష్య కణాలు, మానవ ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాలను చూపిస్తున్నాయని కొత్త అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఇంటర్వెన్షనల్ పెయిన్ మెడిసిన్ ఫిజీషియన్ అయిన డాక్టర్ కునాల్ సూద్ ఈ సమస్య తీవ్రతను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వీడియో (అక్టోబర్ 21) ద్వారా వెల్లడించారు. మైక్రోప్లాస్టిక్స్‌కు, మానవ వృద్ధాప్యానికి మధ్య ఉన్న లింక్‌ను ఆయన నొక్కి చెప్పారు. "మైక్రోప్లాస్టిక్స్ అనేది కేవలం పర్యావరణ సమస్య కాదు" అని డాక్టర్ సూద్ స్పష్టం చేశారు.

ధమనుల నుంచి మెదడు వరకు.. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ !: మైక్రోప్లాస్టిక్స్ ఇప్పుడు కేవలం పర్యావరణానికే పరిమితం కాలేదనే విషయాన్ని డాక్టర్ సూద్ ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈ మైక్రోప్లాస్టిక్‌లను మనుషుల ధమనుల్లో, మెదడు కణజాలంలో, చివరికి గర్భధారణ సమయంలో మావిలో కూడా గుర్తించారు" అని ఆయన తెలిపారు. తాజాగా జరిగిన పరిశోధనలు ఈ భయంకరమైన వాస్తవాన్ని నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కాలుష్య కణాలు శరీరంలోని కణాలపై ఒత్తిడి పెంచుతున్నాయని, ఇది వేగవంతమైన వృద్ధాప్యానికి దారితీస్తుందని సూద్ వివరించారు. ముఖ్యంగా గుండె, మెదడుకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు కూడా ఇవి కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. "మీ కణాలు, అవయవాలు కాలంతో పాటు ఎంత బాగా పనిచేస్తాయనే జీవసంబంధిత వృద్ధాప్యానికి ఈ ప్లాస్టిక్ కణాలు ఆటంకం కలిగిస్తున్నాయి.

అవి కణాలపై ఒత్తిడి పెంచి, వాటి శక్తి సరఫరాను దెబ్బతీస్తాయి. కొన్నిసార్లు కణాలు సాధారణం కంటే త్వరగా పనిచేయడం ఆపేసేలా చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి" అని డాక్టర్ సూద్ వివరించారు.

గుండెపోటు, స్ట్రోక్‌కు మైక్రోప్లాస్టిక్సే కారణమా ?: కణాల నష్టం, శక్తి సరఫరాకు ఆటంకం కలిగించడంతో పాటు, గుండె, మెదడు ఆరోగ్యంపై కూడా మైక్రోప్లాస్టిక్స్ ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని డాక్టర్ సూద్ తెలిపారు. "ఒక అధ్యయనం



ప్రకారం, ధమనుల ఫలకా లలో ప్లాస్టిక్ శకలాలుఉన్న వ్యక్తులలో గుండెపోటు,స్ట్రోక్‌వచ్చే ప్రమా దం, లేదా త్వరగా మరణించే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తేలింది" అని ఆయన పేర్కొన్నారు. మైక్రోప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యం, వఅద్ధా ప్యంపై పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ, ఈ చిన్న కాలుష్య కణాలు మనిషి శరీరం వృద్ధాప్యం చెందే విధానాన్ని నిశ్శబ్దంగా మార్చేస్తున్నాయని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



# అతిథి పక్షులకు స్వర్గధామం





వరంగల్, : అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండినఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపో స్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంర క్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తి నిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేల సంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు.ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమైన పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది

## 14 ఏళ్ల నాటి కల..

కరీంనగర్, : రాజకీయాల్లో ఏ వ్యూహం ఎప్పుడు పారుతుందో.. ఏ స్కెచ్ ఎప్పుడు ఫలిస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రత్యర్థి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలనే పంతం పన్నెండేళ్ల తర్వాత ఇప్పుడు కార్యరూపం దాల్చడం చూస్తుంటే రాజకీయ చదరంగం ఎంత చిత్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలని కేసీఆర్ వేసిన ప్లాన్ చేశారు. ఇన్నాళ్లకు 'జగిత్యాల టైగర్' జీవన్ రెడ్డి రూపంలో సక్సెస్ అయింది. అప్పట్లో తృటిలో తప్పిన ఈ ఫిరాయింపు, ఇప్పుడు రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయాల పుణ్యమా అని సాధ్యపడింది. రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్త కాదు కానీ, పన్నెండేళ్ల క్రితం వేసిన స్కెచ్ ఇప్పుడు ఫలించడం విశేషం. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) కలిపేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే జీవన్ రెడ్డికి గులాబీ గూటి నుంచి ఆహ్వానం అందింది. అయితే ఈ విషయాన్ని తాజాగా జరిగిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి స్వయంగా బయటపెట్టారు.

అటు కేటీఆర్ కూడా 'ఆయన 2014లోనే మా పార్టీలోకి రావాల్సింది, అది ఇప్పటికి కుదిరింది' అని వ్యాఖ్యానించడం ద్వారా నాటి స్కెచ్‌ను పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయ్యింది.జగిత్యాల పంచాయతీ జీవన్ రెడ్డి మనస్థాపానికి ప్రధాన కారణం తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడమే. రెండు ఎన్నికల్లో తనను ఓడించిన వ్యక్తిని రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోయారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోవడం, మెజారిటీ కౌన్సిలర్లు సంజయ్ వర్గం వైపు ఉండడంతో జీవన్ రెడ్డికి సొంత గడ్డపైనే భంగపాటు జరిగింది. మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కకపోవడంతో తన రాజకీయ భవిష్యత్తుపై ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఎంతో కాలం నిరీక్షించిన జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వంపై యుద్ధం ప్రకటించారు.

# భారత రైతాంగ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?

వ్యవసాయ సంక్షోభ నివారణకు, రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు ఆదాయ-సామాజిక భద్రత చేకూర్చేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ప్లస్ 50 శాతం) చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలు ప్రకటించాలని 2006 లోనే నివేదిక నిచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రైతాంగ సమస్యల పరిష్కారం చేస్తానని 2021 డిసెంబర్ 9వ తేదీన ఇచ్చిన లిఖితపూర్వక హామీని తుంగలో తొక్కడమేకాక, కనీస మద్దతు ధరల విధానానికి మంగళం పాడుతూ "జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం" (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్)ను ప్రకటించి, "పంట ధర ఇన్సూరెన్స్" ముసుగులో ఎం.ఎస్.పి ని ఎత్తివేసే ద్రోహానికి ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పూనుకొంది. 2000 నుండి 2013 మధ్య కాలంలో ఎం.ఎస్.పి ధరలు తక్కువగా నిర్ణయించబడటం వలన 23 పంటల పైన భారత రైతాంగానికి రూ.45 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ఒ.ఇ.సి.డి-ఐ.సి.ఆర్.ఐ.ఇ.ఆర్ సంస్థలు పేర్కొన్నాయి. సగటున ఏటా రైతాంగానికి రూ.3 లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఉదాహరణకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.766, మొక్కజొన్నకు రూ.704, జొన్నకు రూ.1,110, కందికి రూ.2,874, మినుముకు రూ.2646, పెసరకు రూ.2,446, పత్తికి రూ.2365 చొప్పున నష్టపోతున్నారు. అందుకే చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలను ప్రకటించాలని పట్టుబడుతున్నాం.

**ప్రైవేట్ వారికోసమే విద్యుత్ సవరణ చట్టం:** వ్యవసాయానికి ఉచిత/తక్కువ టారిఫ్‌తో విద్యుత్, బలహీన వర్గాల పేదలకు రాయితీ విద్యుత్‌లను తొలగించి, మొత్తం ఖర్చులన్నిటితో లెక్కించిన టారిఫ్‌ను, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి, నెలలో ముందుగానే సెల్‌ఫోన్ల తరహాలో బిల్లులు వసూలు చేయాలనే దుష్ట విధానాన్ని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తెచ్చింది. అంతేకాక పలు దశాబ్దాల కాలంలో ప్రజల నుండి పన్నుల ధనం, బ్యాంకుల నుండి/పి.ఎఫ్.సి నుండి రుణాలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుదుత్పత్తి సంస్థలు, డిస్కమ్‌లతో సహా కారుచౌకగా (బుక్ వాల్యూకు) ప్రైవేట్ వారికి కట్టబెట్టే ఈ దుష్ట చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.


**విత్తన చట్టం రైతాంగ వ్యతిరేకం:** విత్తన చట్టం 1966 లోని లోపాలను సరిచేయడానికి బదులు, విదేశీ విత్తన కంపెనీల ప్రయోజనాలను మెరుగు పరిచేందుకు తీసుకువచ్చిన ఈ చట్టంలో నాణ్యత లేని నకిలీ విత్తనాల వల్ల రైతులకు చేకూరిన నష్టానికి పరిహారం గురించి లేకపోవడం అత్యంత ఆశ్చర్యకరం. బహుళజాతి, విదేశీ విత్తన కంపెనీల తెరచాటు సూచనలతో రూపొందించబడిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.

**ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అమలు చేయాలి:** గ్రామీణ నిరుపేదలకు ఉపాధిని, ఆదాయాన్ని సమకూరుస్తూ, ఆహార భద్రతను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో గాంధీజీ పేరు తొలగించడమేకాక, రాజ్యాం గం లోని ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను హరిస్తూ, రాష్ట్రాలను సంప్రదించకుండానే 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం ద్వారా దేశంలోని కోట్లాదిమంది నిరుపేదలకు ఎన్.డి.ఎ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అటకెక్కి ంచడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోంది. అందువలననే వి.బి.గ్రామ్‌జీ పథకాన్ని ఉపసంహరించి...మరికొన్ని మార్పులతో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

**పంట భూములను లాక్కోవడం ఆపాలి:** షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, ఇతర అణగారిన, వెనుకబడిన వర్గాల, పేదల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత రాజ్యాంగం పేర్కొన్న సూత్రాలను భారత సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పులను దృష్టిలో వుంచుకొని, వాటికి భంగం కలుగని రీతిలో భూములను కేటాయించడం అవసరం. కేవలం పారిశ్రామికవేత్తలు కోరిన చోట, కోరినంత విస్తీర్ణాన్ని ఇవ్వాలనుకోవడం తగదు. ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే ప్రభుత్వం భూమిని సేకరించాలని, రైతుల పంట పొలాలను, ముఖ్యంగా బలహీన వర్గాలకు ఎసైన్ చేసిన భూములను తీసుకోరాదని డిమాండ్ చేస్తున్నాం.

**నూతన జాతీయ సమగ్ర కౌలు చట్టం అవసరం:** కౌలు రైతులు అత్యధికంగా భూమి లేని, సన్నకారు, చిన్న రైతులు, బలహీన వర్గాలకు చెందినవారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలను అందించడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నీతి ఆయోగ్ సంస్థ "మోడల్ ల్యాండ్ లీజ్ చట్టాన్ని" అమలు చేయాలని రాష్ట్రాలకు పంపించింది. అయితే ఈచట్టం ప్రకారం రైతుతన భూమిని ఫలానా వ్యక్తికి కౌలుకిచ్చినట్లుగా సంతకం చేయాల్సి వుంటుంది. వెనుకటి కాలంలో వున్న కౌలు చట్టాలు రద్దయ్యాయన్న సమాచారం తెలియకపోవడం, తన భూయాజమాన్య హక్కుకు భంగం కలుగుతుందేమోనన్న అనుమానంతో రైతులలో అత్యధికులు సంతకం చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద, ధనిక రైతులవద్ద హెచ్చువడ్డీలకు రుణాల తీసుకోవలసిన పరిస్థితులు న్నాయి.

# రీ ఎంట్రీకి విజయసాయిరెడ్డి..!



నెల్లూరు, : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాజధాని ప్రతిపాదన విషయంలో జగన్ చుట్టూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీకి టిడిపి, జనసేన బలమైన ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆ జాబితాలో ఇప్పుడు చాలా పార్టీలు వచ్చి చేరుతున్నాయి. చివరకు ఇప్పటివరకు స్నేహంగా వ్యవహరించిన గులాబీ పార్టీ సైతం రూటు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అమరావతి రాజధాని విషయంలో పక్కన ఉన్న తెలంగాణలో సైతం జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రతికూలత వస్తోంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ జరిగిన సమయంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి మాటలు చూస్తే మాత్రం జగన్ పై వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతుంది. మరోవైపు అది చాలదన్నట్టు జగన్మోహన్ రెడ్డి మావిగన్ రాజధాని ప్రతిపాదనను సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేవారు సైతం దిక్కుమాలిన సలహా అంటూ విరుచుకుపడుతున్నారు. మావిగన్ ప్రతిపాదన అనేది జగన్మోహన్ రెడ్డి సొంత నిర్ణయం అని సజ్జల లాంటి వారు మీడియా ముందుకు వచ్చి చెప్తున్నారు.అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఫైనల్ అన్నట్టు ఉండేది. జగన్ పై ఈగ వాలితే అంతా పడిపోయేవారు. కానీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చించే క్రమంలో జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నాయి వివిధ పార్టీలు. కానీ కనీసం కౌంటర్ ఇవ్వలేకపోయారు ఆ పార్టీ నేతలు. నిండు రాజ్యసభలో జగన్మోహన్ రెడ్డి పై కాంగ్రెస్ ఎంపీలు విరుచుకుపడితే ఏం చేస్తున్నట్టు అని ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఇదేనా మీ సమర్థత అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ఇక్కడ విజయసాయిరెడ్డి రెండు రకాల లక్ష్యాలను నెరవేర్చుకున్నారు. ఒకటి తనలాంటి వాడు జగన్ వెంట లేకపోవడం లోటు అని సంకేతాలు పంపాడు. కేంద్ర రాజకీయాల్లో వైసీపీకి అత్యవసరంగా ఒక నేత అవసరం అని గుర్తు చేశారు.మరోవైపు కూటమికి వ్యతిరేకంగా ట్వీట్ చేశారు విజయసాయిరెడ్డి. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పించడం ఎంత ముఖ్యమో.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం అని హెచ్చరిస్తూ స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. కొత్త రాజధాని ప్రతిపాదన కంటే రైతుల సమస్యలపై వైసీపీ పోరాడితే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. అయితే ఇప్పటికీ తాను కూటమికి వ్యతిరేకమని.. అవసరం అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమని సంకేతాలు పంపగలరు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన ఆయన తరువాతే ఎందుకో రాజకీయాలు మాట్లాడుతూ వచ్చారు. రాజకీయాలు చేయాలని ఉందని చెప్పుకొచ్చారు. బిజెపిలోకి వెళ్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయారు. అందుకే జగన్ ఒప్పుకుంటే తిరిగి వైసీపీలో చేరుతానని సంకేతాలు పంపుతున్నారు. కానీ జగన్ అందుకు ఒప్పుకుంటారో? లేదో? చూడాలి.

# జనారణ్యంలోకి జంతువులు



కర్నూలు, : రాయలసీమ వ్యాప్తంగా జనావాసాల్లోకి చిరుతల చొరబాట్లు పెరగడం కనిపిస్తోంది. పులులకు తీవ్రమైన నీటి కొరత, ఆవాసాలు తగ్గిపోవడం, పెరుగుతున్న పర్యావరణ ఒత్తిడే ఈ ధోరణికి కారణమని అటవీ అధికారులు పేర్కొంటున్నారు. తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోకపోతే.. ఈ ప్రాంతంలో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా దువ్వూరు మండలం చిన్న బకరపురం గ్రామంలో ఇటీవల జరిగిన ఓ ఘటన జరిగింది. గ్రామంలోకి ప్రవేశించిన చిరుత పిల్లను వీధి కుక్కలు చంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ అధికారుల సమాచారం ప్రకారం, రాయలసీమలో గత మూడేళ్లలో మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశించిన 30కి పైగా చిరుతలు మరణించాయి. ఆందోళనకరంగా, గత సంవత్సరంలోనే 16 మరణాలు నమోదయ్యాయి.చిరుతపులులు మేకలు, గొర్రెలు, దూడలు, ఆవులు వంటి జంతువులను ఇష్టపడతాయి. ఆహారం కోసం అవి మానవ నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. కొన్నిసార్లు, అటవీ ప్రాంతాల్లో సమీపంలో నీటి వనరులు లేకపోవడం కూడా ఒక కారణంగా ఉంది. చిరుతపులులు దట్టమైన అడవుల్లో లోపల ఉండటానికి బదులుగా, కొద్దిగా బహిరంగ లేదా మైదాన ప్రాంతాల్లోకి వెళ్లడానికి ఇష్టపడతాయని అటవీ అధికారులు అంటున్నారు.చిరుతపులులు మనుషులపై దాడి చేయడానికి బయటకు రావడం లేదు. కానీ ఆకస్మాత్తుగా మనిషి ఎదురైతే దాని రక్షణలో భాగంగా దాడి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటి సంచారం ప్రధానంగా ఆహారం, నీటి అన్వేషణ కోసమే ఉంటుంది. అడవుల అంచున ఉన్న గ్రామాల్లోకి చిరుతలు ఎక్కువగా వస్తుంటాయి.వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు, అడవి పందులను నివారించడానికి రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలు పులులకు ఇబ్బందికరంగా మారాయి. విద్యుత్ కంచెల కారణంగా ప్రమాదవశాత్తు మరణాలు పెరుగుతున్నాయి. రైతులలో తక్షణమే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.అటవీ భూముల ఆక్రమణలతో పులుల సహజ ఆవాసాలను తగ్గిపోయేలా చేస్తూ, వన్యప్రాణులను మానవ నివాసాలకు మరింత దగ్గరగా నెడుతున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు జనావాస ప్రాంతాల వైపు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉందని, ఇది తమ జీవనోపాధికి ముప్పుగా మారిందని రైతులు వాపోతున్నారు.కొన్నిసార్లు పొలాల దగ్గర చిరుతపులులు సంచారం ఉన్నట్టుగా రైతులు చూస్తున్నారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పశువులను, మేకలను మేతకు బయటకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నాయి.

# సమ్మెకు దిగిన విద్యుత్ ఆర్టిజెన్ ఉద్యోగులు!

## పర్మనెంట్ చేసి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్!

జనగామ :తాము దశాబ్దాల తరబడి ఎట్టి చేస్తున్నప్పటికీ మాతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న మా విద్యుత్ శాఖ మమ్మల్ని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించకుండా, నిర్లక్ష్యం చేస్తున్నదని,పాలకులు మమ్మల్ని ధగా చేస్తున్నరని విద్యుత్ శాఖలో పని చేస్తున్న వివిధ యూనియన్లకు చెందిన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు.ఉద్యమ ప్రభుత్వం 2017 లో పర్మనెంట్ చేస్తానంటే ఉద్ధరిస్తుందని నమ్మినం. కానీ 2020 లో కొత్త సర్వీస్ రూల్ తెచ్చి నమ్మి నానబోస్తే పుచ్చిబుర్రలు చేసి తెచ్చిపోసినట్లు ఉత్త చేతులు మా మొఖాన కొట్టిందని,గత ప్రభుత్వాలు చేసిన అన్యాయాన్ని సరిదిద్ది నేటి ప్రభుత్వం మాయడల మానవత్వాన్ని ప్రదర్శించాలని,మా న్యాయ మైన డిమాండ్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నరు. ఈ రోజు స్టేషన్ ఘనపూర్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిభి రంలో ప్రసంగించి నకార్మిక సంఘం నేతపాశం రాజుతదితరులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్హతల ఆధారంగా ఇప్పటి వరకు పర్మనెంట్ కాని ఉద్యోగులను అందరిని పర్మనెంట్ ఉదోగులుగా ఆయా కేటగిరిల్లో విలీనం చేసుకోవాలని,కెసిఆర్ ప్రభుత్వం తెచ్చిన సర్వీస్ రూల్సుకు చరమ గీతం పాడి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, కోరారు.టీజీ ఎస్పీడిసీఎల్,టీజీ ఎన్పిడిసీఎల్ లోని అన్ మాన్డు వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలని వారు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.4-12-2016 కంటేముందు విద్యుత్ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న విద్యావంతులను ఆర్టిజెన్ లుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖలో అనేక అవసరాల్లో వినియోగించుకుంటూ,ఏ గుర్తింపు ఇవ్వకుండా ఎట్టివాళ్ళుగాఉట్టిగనే వదిలేసిన వాళ్లలోని అర్హులైన పీస్ రేట్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించి 2026 పీర్సీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# వైసీపీతో బీసీవై కలిసి పోటీ..!

విజయవాడ,: రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఏ స్థితిలో ఉంటారో చెప్పలేము. ఎందుకంటే ఒకసారి ఓటమి ఎదురవుతుంది. మరోసారి గెలుపు తలుపు తడుతుంది. అయితే రాజకీయ అవసరాలు కూడా అంతే. ఎవరితో ఏ అవసరం వస్తుందో చెప్పలేం కూడా. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి. ప్రత్యర్థి పార్టీలను ఓ రేంజ్ లో వేసుకోవడం వైసీపీకి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అయితే ఈ విషయంలో జనసేన కూడా బాధితురాలు. ఎందుకంటే జనసేన ను టార్గెట్ చేసుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రచారం అంటూ లేదు. మొన్న జనసేన సంపూర్ణ విజయం, వైయస్సార్ కాంగ్రెస్ దారుణ ఓటమితో ఈ ప్రచారం కొట్టుకెళ్లిపోయింది. కానీ ఇప్పుడు అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భారత చైతన్య యువజన పార్టీ.. అలియాస్ బిసివై పార్టీపై ఆధారపడుతోందన్న టాక్ ప్రారంభం అయింది. ఆ పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడుతుండడం కొత్త రాజకీయ పరిణామం.చిత్తూరు జిల్లాకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ భారత యువజన చైతన్య పార్టీని ఏర్పాటు చేశారు. బడుగులకు రాజ్యాధికారం అన్న నినాదంతో ఈ పార్టీని స్థాపించారు. పారిశ్రామికవేత్త అయిన బోడే రామచంద్ర యాదవ్ కు కేంద్రంలో మంచి పట్టు ఉంది. 2019 ఎన్నికల కు ముందు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి జనసేన తరఫున పుంగనూరు నుంచి పోటీ చేశారు. కానీ ఓటమి ఎదురయింది. కనీసం డిపాజిట్లు రాలేదు. అయితే తరువాత భారత చైతన్య యువజన పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీసీవై పార్టీని టార్గెట్ చేశారు. పలుమార్లు బోడే రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి కూడా జరిగింది. కేవలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ చంద్రబాబు బీసీవై పార్టీ వెనుక ఉన్నారనేది అప్పట్లో ఒక విమర్శ. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అయితే బోడె రామచంద్ర యాదవ్ పై ఓ రేంజ్‌లో విరుచుకుపడేవారు. ఆయన పేరును ప్రస్తావించేందుకు కూడా ఇష్టపడేవారు కాదు. పూజకు పనికిరాని పువ్వు అని సంబోధించేవారు. గతంలో బోడె రామచంద్ర యాదవ్ పై దాడి జరిగినప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఖండించారు. ఒక సాధారణ నేతగా ఉన్న బోడె రామచంద్ర యాదవ్ విషయంలో ప్రతిపక్ష నేత స్పందించడం అప్పట్లో ఒక సంచలనమే. కనీసం బీసీవై పార్టీ ఒక పార్టీయేనా అని వ్యాఖ్యానించేవారు వైసీపీ సామాన్య కార్యకర్తలు.. కానీ ఇటీవల ఎందుకో బోడె రామచంద్ర యాదవ్ రూట్ మారింది. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వాన్ని విపరీతంగా వ్యతిరేకిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి విషయంలో సానుకూలంగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి కట్టాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అందులో భాగంగానే బీసీవై పార్టీని కూటమి ప్రభుత్వంపై ఉసిగొల్పుతున్నారన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



## నీళ్ల ట్యాంకు ఓవర్‌ఫ్లోతో నీరు వృధా

### వాహనదారులకు ప్రమాదం

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిదేవాలయం పక్కన ఉన్న నీళ్ల ట్యాంకు నుంచి ప్రతిరోజూ నీరు వృథాగా ట్యాంకు నిండి రహదారిపై పొర్లిపోతు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్య గతంలో బైరి రాధ సర్పంచ్‌గా ఉన్న కాలం నుంచే కొనసాగుతోందని స్థానికులు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 12 గంటల నుంచి 2 గంటల మధ్య ట్యాంకు నిండిపోవడంతో నీరు రోడ్డు పైకి పొంగిపొర్లుతుందని పేర్కొన్నారు. వృథాగా పారుతున్న ఈ నీటితో సుమారు నాలుగు ఎకరాల పంట సాగు చేయవచ్చని స్థానికులు అంటున్నారు. సమస్యకు పరిష్కారంగా ట్యాంకుకు ఓవర్‌ఫ్లో పైప్ ఏర్పాటు చేసి, సబ్‌స్టేషన్ మూలం నుంచి కిరాణా దుకాణం వరకు పైప్‌లైన్ వేయాలని సూచిస్తున్నారు. అక్కడి నుంచి సబ్‌స్టేషన్ ఫెన్సింగ్ పక్కనజేసీబీ ద్వారా కాలువ తవ్వి, ఇందూరు పోచమ్మ రోడ్డుకు అనుసంధానం చేస్తే గ్రామపంచాయతీ మురికి కాలువలోకి నీరు మళ్లించవచ్చని తెలిపారు. ప్రస్తుతం వర్క్‌షాప్ యజమానులు మట్టి పోసి మూసివేసిన మురికి కాలువను తిరిగి తెరిస్తే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని, నీరు నడిమి కుంటకు చేరుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# హైదరాబాద్ కు మరో డాల్బీ థియేటర్!

హైదరాబాద్, : రెండు వారాల కిందట హైదరాబాద్‌లో ప్రారంభమైన అల్లు సినిమాస్ డాల్బీ థియేటర్ ఇప్పుడు నగరానికే ఓ స్పెషల్ అట్రాక్షన్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యామిలీ పేరుతో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. ఇప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా హైదరాబాద్‌కు మరో డాల్బీ థియేటర్‌ను తీసుకురాబోతున్నారు. మహేష్‌కు థియేటర్లు కొత్తకాదు.. ఆయన చాలా ఏళ్లుగా ఈ బిజినెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు మహేష్ కూడా హైదరాబాద్‌కు డాల్బీ తెస్తున్నారు.సూపర్ స్టార్ మహేష్‌బాబు చాలా ఏళ్ల కిందటి నుంచి వివిధ రకాల బిజినెస్‌లలో ఉన్నారు. అందులో ముఖ్యమైంది మూవీస్. ప్రముఖ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్ ఆసియన్ సునీల్ భాగస్వామ్యంతో మహేశ్‌బాబు ఎఎంబీ సినిమాస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్ కింద వివిధ నగరాల్లో మల్టిప్లెక్స్‌లు ఉన్నాయి. అల్లు సినిమాస్ ఈ మధ్యన హైదరాబాద్‌లో డాల్బీ థియేటర్‌ను ప్రారంభించింది కానీ.. అసలు సౌత్ ఇండియాలో మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను ఇంట్రడ్యూస్ చేసింది మహేష్ బాబే. ఈ జనవరి 16న బెంగళూరులోని లో సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి డాల్బీ థియేటర్‌ను మహేష్ ప్రారంభించారు. 9 స్క్రీన్‌లు ఉన్న ఆ మల్టిప్లెక్స్ లో 588 సీట్లు ఉన్న పెద్ద థియేటర్‌ను డాల్బీగా మార్చారు. ఇప్పుడు అదే క్రమంలో హైదరాబాద్‌కు ఆయన డాల్బీ థియేటర్‌ను తెస్తున్నారు. హైదరాబాద్ సినిమా కూడలి అయిన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ని సుదర్శన్ థియేటర్‌ను మహేష్‌బాబు భాగస్వామ్యంలో ఆసియన్ సంస్థ ఏఎంబీ క్లాసిక్ పేరుతో మల్టిప్లెక్స్‌గా మారుస్తోంది. పాత థియేటర్ స్థానంలో మొత్తం 7 స్క్రీన్ల మల్టిప్లెక్స్ అక్కడ వస్తోంది. ఇప్పుడు అందులో ఓ ఆడిటోరియంను డాల్బీ థియేటర్‌గా మారుస్తున్నారు. 4ఐ లేజర్ ప్రొజెక్షన్‌తో డాల్బీ విజన్ స్క్రీన్ అందుబాటులోకి వస్తోంది. ఇప్పటికే కోకాపేటలో దేశంలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్ అందుబాటులోకి వచ్చింది. ఇది వెస్ట్ హైదరాబాద్‌లో ఉంటే.. మహేష్ డాల్బీ థియేటర్ హైదరాబాద్ నడిబొడ్డున రానుంది. పైగా క్రాస్‌రోడ్ అంటే సినిమా జంక్షన్. సో నగరవాసులకు అందుబాటులోకి స్క్రీన్ వస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి క్లాసిక్ డాల్బీ రెడీ కానుంది. మహేష్‌బాబు సినిమానే కాదు... హైదరాబాద్‌లో అతి తొందరలోనే మరో డాల్బీ సినిమా అందు?టులోకి వస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ జీడిమెట్ల రంగా థియేటర్‌ను తీసుకుని దానిని పూర్తిగా ఆధునీకరిస్తోంది. ఈ థియటర్‌కూడా డాల్బీ విజన్ స్క్రీన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. అది ఈ ఏడాది జూన్ నాటికే రెడీ అవుతుందంట.. అయితే ఇక హైదారబాద్ వాసులకు పండుగే. ఈ ఏడాది చివరినాటికి మొత్తం మూడు డాల్బీ థియేటర్లు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే నగరంలోని పెద్ద స్క్రీన్, థియేటర్ అయిన ప్రసాద్సు కూడా ఆధునీకరించారు. లేటెస్ట్.. ప్రొజెక్షన్ అందుబాటులోకి తెచ్చారు. ఇక హైదరాబాద్‌కు ఉన్న లోటు స్క్రీన్.




ఒకప్పుడు ప్రసాద్స్‌లో ఉన్న ఐ మ్యాకస్ సేవలు నిలిచిపోవడంతో ఆ లోటు అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు మన సినిమాలు భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వస్తున్నాయి. భారీ స్క్రీన్‌లపై వాటిని అనుభూతి చెందితే ఆ థ్రిల్లే వేరు. వారణాసి, రామయణ్ లాంటి ఇండియన్‌మూవీస్‌ను ఇప్పుడు ఐమాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరించారు. మరికొన్ని భారీ సినిమాలు కూడా వస్తాయి. అయితే హైదరాబాద్‌లో స్క్రీన్ కూడా మహేష్‌బాబునే తీసుకొచ్చే అవకాశం ఉంది. ఆసియన్ భాగస్వామ్యంతో హకీంపేట్ వద్ద భారీ థియేటర్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఓ స్క్రీన్ ఐమాక్స్ అవుతుందనే ప్రచారం జరుగుతోంది కానీ.. దానిని వాళ్లు అధికారికంగా ధృవీకరించలేదు.

# సైబారాబాద్‌లో మరో టవర్!

హైదరాబాద్, : సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం కైత్లాపూర్‌లో రూ.200 కోట్లతో కొత్తగా సమీకృత భవన సముదాయాన్ని నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. 5 ఎకరాల విస్తీర్ణంలో జీ+8 అంతస్తులతో సైబర్ టవర్స్ తరహాలో ఇది నిర్మాణం కానుంది. ఒకే భవనంలో మున్సిపల్, జలమండలి, రెవెన్యూ, విద్యుత్ శాఖల కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. ప్రజలకు పరిపాలనను మరింత సులభతరం చేసేలా ఈ క్యూఆర్ రీజియన్ అభివృద్ధి ప్రణాళిక రూపుదిద్దుకుంది.హైదరాబాద్ నగరం అనగానే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది మాదాపూర్‌లోని సైబర్ టవర్స్. ఐటీ విప్లవానికి చిహ్నంగా నిలిచిన ఆ కట్టడం తరహాలోనే.. ఇప్పుడు అత్యాధునిక హంగులతో మరో భారీ భవన సముదాయం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ నగరపాలక సంస్థ కోసం ఈ ఐకానిక్ భవనాన్ని నిర్మించబోతున్నారు. ఐటీ కారిడార్‌లో పాలనను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నూతన పరిపాలన భవనం కోసం కైత్లాపూర్‌లోని
ఐదెకరాల భూమిని అధికారులు ఎంపిక చేశారు. సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవన నిర్మాణానికి ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.ప్రస్తుతం సీఎంసీ కార్యాలయం హైటెక్స్‌లోని న్యాక్ భవనంలో కొనసాగుతుండగా.. కమిషనర్ సృజన ఆధ్వర్యంలో నూతన భవన ఆకృతుల రూపకల్పన వేగంగా జరుగుతోంది. ప్రభుత్వ ఆమోదం పొందిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం జీహెచ్ఎంసీని పునర్వ్యవస్థీకరించి జీహెచ్ఎంసీ, సీఎంసీ (సైబరాబాద్), ఎంఎంసీ (మల్కాజిగిరి)లుగా విభజించిన సంగతి తెలిసిందే. సీఎంసీ పరిధిలోకి మణికొండ, నార్సింగి, శేరిలింగంపల్లి నుంచి మేడ్చల్ వరకు 3 జోన్లు, 16 సర్కిళ్లు వచ్చాయి. ఈ భారీ భవనాన్ని 'జీ+8' అంతస్తులతో నిర్మించనున్నారు. కేవలం మున్సిపల్ కార్యాలయం మాత్రమే కాకుండా.. ప్రజలకు అన్ని సేవలు ఒకే చోట అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.ఒకే గొడుగు కింద అన్ని విభాగాలు చేర్చనున్నారు. ఈ సమీకృత భవన సముదాయంలో సీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్, జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయం, విద్యుత్, రెవెన్యూ శాఖల విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు వివిధ పనుల కోసం వేర్వేరు కార్యాలయాలకు తిరిగే అవసరం లేకుండా.. ఒకే భవనంలో అన్ని ప్రభుత్వ సేవలు లభించేలా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ నగరిలో ఈ కొత్త భవనంమరో ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సైబరాబాద్ నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. త్వరలోనే అందుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని అంటున్నారు.

## రాజ్యసభ రేసు.. భారీగా పెరుగుతున్న ఆశావహులు



విజయవాడ, : తెలుగుదేశం పార్టీలో రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్‌లో ఖాళీ అవుతున్న నాలుగు స్థానాలకు గాను, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై పార్టీ వర్గాల్లో తీవ్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగిలిన స్థానాలకు రకరకాల పేర్లు చర్చల్లోకి వస్తున్నాయి. టీడీపీ ఐటీ విభాగంలో చురుగ్గా ఉంటూ, గత ఎన్నికల్లో పార్టీ సోషల్ మీడియా వ్యూహకర్తగా పనిచేసిన చింతకాయల విజయ్ పేరు రేసులో ముందుండటానికి ప్రధాన కారణం యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అధిష్టానం ఆలోచనే. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి బలమైన బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విజయ్ వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొని పార్టీ కోసం నిలబడినందుకు ఆయనకు ఈ గుర్తింపు దక్కవచ్చని క్యాడర్ భావిస్తోంది.మరోవైపు, పార్టీలో అత్యంత సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు పేరు కూడా చర్చల్లో ఉంది. గత కొంతకాలంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీకి ట్రబుల్ షూటర్‌గా, ఆర్థిక వ్యవహారా ల్లో పట్టున్న నేతగా యనమల సేవలను ఢిల్లీ స్థాయిలో ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తే ఆయనకు అవకాశం దక్కవచ్చు. అయితే, సామాజిక సమీకరణాలు, కొత్త రక్తాన్ని ఎక్కించాలనే లోకేష్ వ్యూహం కారణంగా సీనియర్లకు ఏ మేరకు ప్రాధాన్యత ఉంటుందన్నది ఉత్కంఠగా మారింది. వ్యాపార కారణాలు, రాజకీయ ఒత్తిళ్ల వల్ల గత లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్న గల్లా జయదేవ్ పేరు మళ్లీ తెరపైకి వచ్చింది. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పడంలో ఆయనకు ఉన్న అనుభవం, అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న నెట్‌వర్క్ పార్టీకి అవసరమని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఆయన రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు గతంలోనే ప్రకటించినందున, మళ్లీ రాజ్యసభ ద్వారా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిఉంది. ఇక గత ఎన్నికల్లో చాన్స్ దొరకని దేవినేని ఉమకూడా రేసులోఉన్నారు. యువ నేతలువంగవీటిరాధాతో పాటు మహాసేన రాజేష్ వంటి వారు కూడా సామాజికవర్గ కోటాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు ప్రధానంగా మూడు సూత్రాలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. బీసీ, ఎస్సీ, కాపు సామాజిక వర్గాలకు సమతుల్యత పాటించడం..కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా మాట్లాడగలిగే వ్యక్తులను పంపే అంశాలను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు పార్టీ కోసం పనిచేసిన మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కూడా టీడీపీ పరిశీలిస్తోంది. ఢిల్లీలో పార్టీ వాయిస్ బలంగా వినిపించే వారికే చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మిత్రపక్షాలకూ సీట్లు కేటాయించాల్సి ఉంది. జాతీయ స్థాయి ప్రాధాన్యత దృష్ట్యా బీజేపీ ఓ సీటును కోరుకుంటుందని అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇస్తే జనసేన పార్టీకి చాన్స్ ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

## యూఎస్ రాజధాని వాషింగ్టన్ డీసీలో విజయతోరణం..



ఢిల్లీ,: అగ్రరాజ్యం అమెరికా కు రాజధాని నగరమైన వాషింగ్టన్ డీసీ లో భారీ విజయ తోరణాన్ని నిర్మించేందుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన ప్రణాళికను అమెరికా ప్రభుత్వానికి చెందిన యూఎస్ కమిషన్ ఆన్ ఫైన్ ఆర్ట్స్ శుక్రవారం విడుదల చేసింది. తోరణంపై 250 అడుగుల ఎత్తైన రెక్కల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆ విగ్రహం చేతిలో న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ చేతిలో ఉన్నట్లుగా కాగడా ఉండనుంది. అదేవిధంగా తలపై కిరీటం ఉంటుంది. విగ్రహానికి రెండువైపులా రెండు గద్దలు, నాలుగు సింహాల విగ్రహాలు ఉంటాయి. అన్ని విగ్రహాలకు బంగారు పూత వేస్తారు. ఈ తోరణం తూర్పు భాగంలో లింకన్ మెమోరియల్, పశ్చిమ భాగంలో ఆర్లింగ్టన్ జాతీయ శ్మశానవాటిక ఉంటాయి. కొత్త నిర్మాణం పూర్తయితే 99 అడుగుల ఎత్తులో ఉన్న లింకన్ మెమోరియల్ దీనికన్నా చిన్నదిగా కనిపిస్తుంది. భారీ విజయతోరణం ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన, అందమైనదిగా నిలుస్తుందంటూ ట్రంప్ సోషల్ మీడియాలో తాజాగా ఒక పోస్ట్ పెట్టారు. వాషింగ్టన్ డీసీ ప్రాంతానికి అది ఒక అద్భుతమైన అదనపు ఆకర్షణగా మారుతుందని అన్నారు. కాగా అమెరికా స్వాతంత్ర్యాన్ని పొంది 250 ఏళ్లవుతున్న సందర్భంగా ఈ భారీ నిర్మాణాన్ని తలపెట్టారు. అమెరికాకు 1776లో స్వాతంత్ర్యం వచ్చింది.

## అన్నసాగర్ లో ఆరోగ్య శిబిరం

ఎల్లారెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పల్లె దావకన (అన్నసాగర్) లో "మాత్మల్ "వైద్యధికారి డా"శరత్ కుమార్ సార్ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డీసిజ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది, తగిన పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్, క్యాన్సర్ రాకుండా తాగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించడం జరిగింది, అదే విధంగా సరైన డైట్ తీసుకోవాలని, వ్యాయామం చేయాలని తెలిపారు.




# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !



ట్రంప్, నెతన్యాహులు కలిసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరాన్ నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హోర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది.ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించగలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హోర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# ఏపీకి ఆర్థిక కష్టాలు

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకీ కఠినంగా మారుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. 2014 జూన్ 2 న రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేకపోయిందన్నది వాస్తవం. రాజకీయంగా తీవ్రమైన పోటీ ఉండటంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీలు అనేక ఉచిత హామీలు ఇస్తూ వచ్చాయి. అదే సమయంలో ఆదాయ వనరులు బలపడకపోవడం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది. విభజన సమయంలోనే ఏపీ భారీ రెవెన్యూ లోటుతో ప్రారంభమైంది. కాగ్ నివేదిక ప్రకారం 2014?15 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 24,194 కోట్ల రూపాయల లోటు నమోదైంది. ఆ తర్వాత ఆదాయాన్ని తెచ్చే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవడంతో లోటు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సంవత్సరానికోసారి ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరిగి చివరకు సాధారణ పరిపాలనా అవసరాలకే రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రెండో దశ జీఎస్టీ సంస్కరణల పేరుతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి కొత్త స్లాబులు అమల్లోకి తీసుకొచ్చింది. మధ్యతరగతి, దిగువ తరగతికి ఊరట కలిగించాలన్న ఉద్దేశంతో అనేక వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఏపీకి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతుందన్న అంచనాలు అప్పుడే వినిపించాయి. కానీ వాస్తవంగా చూస్తే ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. గణాంకాలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబర్‌లో జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి 2,777 కోట్ల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదే నెలలో అది స్పష్టంగా తగ్గింది. అలాగే గత ఏడాది నవంబర్ లో 2,827 కోట్ల రూపాయలు వచ్చిన చోట ఈ ఏడాది నవంబర్‌లో కేవలం 2,697 కోట్ల రూపాయలకే పరిమితమైంది. అంటే సుమారు నాలుగు శాతం కంటే ఎక్కువగా



ఆదాయం తగ్గినట్టు లెక్కలు చెబుతున్నాయి. జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు వచ్చిన నష్టాన్ని కేంద్రం ఏదో రూపంలో భర్తీ చేయాల్సి ఉన్నా, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఈ దెబ్బ ఎక్కువగా తగిలిందని విశ్లేషకులు అంటున్నారు. గత పదకొండేళ్లలో పరిశ్రమలు, సేవారంగం పెద్దగా ఆదాయాన్ని తీసుకురాలేకపోయాయి. ఇప్పటికీ వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వంపై ఖర్చుల భారం భారీగా పెరిగింది. సామాజిక పెన్షన్లను నాలుగు వేల రూపాయలకు పెంచి సుమారు 65 లక్షల మందికి చెల్లిస్తున్నారు. ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు అమల్లో ఉన్నాయి. వీటితో పాటు ఇతర హామీలు కూడా ఉన్నాయి. ఆదాయం తగ్గి, ఖర్చులు పెరగడంతో అప్పులపై ఆధారపడక తప్పడం లేదు. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం కూడా రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. మొత్తం మీద రాష్ట్ర ఆర్థిక స్థితి ఆందోళనకరంగా ఉందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏపీ ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధీకరించడానికి ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి..

# కాపు నేతలకు గాలం

కాకినాడ, : ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటినుంచి పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. సామాజిక వర్గాలను తెరపైకి తెచ్చి మరోసారి విజయం అందుకోవాలని భావిస్తోంది. కానీ అది అంత సులువుగా దక్కేలా లేదు. ఎందుకంటే 2014 నుంచి 2024 వరకు వైసిపి చేపట్టిన ఈ ఫార్ములా ఆ పార్టీకి వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు ఎంత మాత్రం అది సాధ్యమయ్యే అవకాశం లేదు. కుల సమీకరణల ద్వారా రాజకీయం చేస్తామంటే కుదిరే పని కూడా కాదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని కాపు సామాజిక వర్గంపై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతం మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే నినాదం పక్కకు వెళ్లిపోయినట్లు సమాచారం. వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్ అనేది రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ సామాజిక వర్గాలే ఉండేవి. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడడానికి కారణం ఆ రెండు సామాజిక వర్గాలు మాత్రమే. రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గ ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో అక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలిగింది. ఎస్సీలతో పాటు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో గెలవగలిగింది వైయస్సార్ కాంగ్రెస్. అయితే 2019 ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాలు స్టాండ్ అయ్యాయి. ఆపై మిగతా సామాజిక వర్గాలు సహకరించాయి. దీంతో అంతులేని, అద్భుత విజయం సొంతం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ 2024 ఎన్నికలు వచ్చేసరికి బీసీ నామస్మరణ చేశారు జగన్మోహన్ రెడ్డి. ఎలాగూ సంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటుందని భావించి అలా చేశారు. కానీ రాజకీయంతో పాటు ఆర్థికంగా ఏమాత్రం సహకారం అందకపోవడంతో రెడ్డి సామాజిక వర్గం మౌనం దాల్చింది. ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు చీలిపోయి దారుణ పరాజయం ఎదురైంది. ఇప్పుడు కూడా కుల సమీకరణల ద్వారా రాజకీయాలు చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. పవన్ కళ్యాణ్ వెంట కాపు సామాజిక వర్గం ఉందన్న ఆలోచనతో ముద్రగడ పద్మనాభం, చేగొండి హరి రామ జోగయ్య, వంగవీటి మోహన్ రంగా వంటి కుటుంబాలను ఆకర్షించాలని చూస్తున్నారు. ఇప్పటికే ముద్రగడ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. చేగొండి హరి రామ జోగయ్య వైసీపీకి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమార్తె ఆశ కిరణ్ ను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పేరు మోసిన కుటుంబాలు వైసీపీలోకి వస్తే చాలదు. క్షేత్రస్థాయిలో కాపు సామాజిక వర్గంలో ఆశలు చిగురించే ప్రయత్నాలు జరగాలి. వారి సమస్యల పట్ల జగన్మోహన్ రెడ్డి స్పందించాలి. అంతేతప్ప ప్రముఖుల కుటుంబాలను కాపుల్లో చేర్చితే ఎంత మాత్రం వర్కౌట్ కాదు. 2014లో టిడిపి గెలిచిన తర్వాత ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమం లేవనెత్తారు. ఆ సమయంలో కాపులు టిడిపి పట్ల ఆగ్రహంతో ఉండేవారు. అలా వారు వైసిపి వైపు వెళ్లారు. కానీ ఆ పోరాటం చేసిన ముద్రగడ పద్మనాభం 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. కానీ ఆ పార్టీని నమ్మలేదు కాపులు. ఇప్పుడు కూడా కాపు ప్రముఖులను నమ్ముకుంటే కంటే.. కాపుల కోసం చేసే ప్రయత్నాలతో పాటు ప్రకటనలు, పోరాటాల వారికి ఆకట్టుకునేలా చేస్తాయి. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## కంటోన్మెంట్ ఏరియాలో..

# మంచినీటి సరఫర మెరుగుపరచాలి




### బోర్డ్ సభ్యురాలు భానుక నర్మద

సికింద్రాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రిగేడియర్ రాజీవ్, ప్రెసిడెంట్, కంటోన్మెంట్ సీఈవో అర్వింద్ కుమార్ దీవ్వేది, జాయింట్ సీఈవో ఆశిక్ హుస్సేన్, నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ హాజరయినారు. బోర్డు సమావేశంలో ప్రజలకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై నర్మద మల్లఖార్జున్ సుదీర్ఘంగా ప్రసంగి ంచారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా కంటోన్మెంట్ భూముల పరిహారం కింద ఇప్పటికే రూ.303 కోట్ల రూపాయలు జమ కాగా, ఇంకా రూ.13 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. మిగిలిన ఈ రూ.13 కోట్ల నిధులతో కంటోన్మెంట్ పరిధిలోని 8 వార్డుల్లో పూర్తిగా పాడైపోయిన, దెబ్బతిన్న రోడ్లను వెంటనే నిర్మించాలని ఆమె కోరారు. ఇటీవల ఆస్తి పన్నుల మదింపు సమయంలో పన్నులు 100 నుండి 200 శాతం వరకు పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల పన్నులను 15 నుండి 20 శాతం వరకు మాత్రమే పెంచి ప్రజలపై భారం పడకుండా చూడాలని బోర్డును కోరారు. ఇటీవల జూబ్లీ బస్ స్టాండ్ ఆవరణలోని అటల్ బిహారీ వాజపేయి పార్క్ ప్రక్కన ఖాళీ స్థలంలో కొందరు బీద ప్రజలు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, ఆ స్థలం రక్షణ శాఖ అధీనంలోని కంటోన్మెంట్ బోర్డు స్థలం కావడంతో నిర్మాణాలను తొలగించడం జరిగింది. దీని వలన అనేక మంది బీద ప్రజలు రోడ్డున పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఈటెల రాజేందర్ స్పందించి నేషనల్ ఎస్టీ కమిషన్లో ఫిర్యాదు చేసి, కూల్చివేసిన స్థలంలోనే కంటోన్మెంట్ బోర్డు ద్వారా మళ్లీ నిర్మాణాలు చేపట్టి వారికి కేటాయించే విధంగా కృషి చేసినందుకు అక్కడ ఎంపి ఈటెల రాజేందర్కు పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బానుక నర్మద మల్లిఖార్జున్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా 3 నుండి 4 రోజులకు ఒకసారి మాత్రమే అందుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకా లం ప్రారంభమయ్యేలోపే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో గడ్డు పరిస్థితులు తప్పవని హెచ్చరించారు.

వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, సంబం ధిత అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచాలని కోరారు. అదేవిధంగా హెచ్ఎండీయేం ఆధ్వర్యంలో కంటోన్మెంట్లోని రామన్న కుంట (లేక్) సుందరీకరణ పనులు చేపట్టేందుకు ఒక నెలలోపు ఎన్వోసీ ఇవ్వాలని రక్షణ శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా, బానుక నర్మద మల్లిఖార్జున్ గారు శుభవార్త తెలియజే స్తూ రానున్న పక్షం రోజుల్లో రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కంటోన్మెం ట్కు గ్రాంట్ (నిధులు) మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.

# బాధితు కుటుంబాలకు అండగా ఉన్న ఎమ్మెల్యే




గోదావరిఖని:శివాజీ నగర్ వస్త్ర వ్యాపారుల మరియు బుక్క దుకాణాల, ఫ్లవర్ మర్చంట్ దారుల పత్రికా సమావేశం శివాజీ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ లో గోదావరిఖని పట్టణ ప్రాంతంలోని శివాజీ నగర్‌కు చెందిన బట్టల వ్యాపారస్తులు ఈరోజు ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ తమకు అందించిన అభివృద్ధి, సహకారం, అలాగే ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన విధానాన్ని ప్రశంసించారు. వ్యాపారస్తులు మాట్లాడుతూ - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎప్పుడూ, ఎవరికీ, ఎలాంటి అన్యాయం చేయలేదని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా శివాజీ నగర్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం తమ షాపులు తొలగించాల్సి వచ్చినప్పటికీ, తమ జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాకు పూర్తి న్యాయం చేశారని తెలిపారు. షాపులు తొలగించిన వెంటనే వ్యాపారస్తులు ఇబ్బందులు పడకుండా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించి మమ్మల్ని ఆదుకున్నారని, ఇది ఆయన ప్రజాప్రతినిధిగా చూపిన బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమని వారు అన్నారు. అభివృద్ధి జరుగుతున్నా ప్రజల ఉపాధి దెబ్బతినకూడదన్న దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే గోదావరిఖని పట్టణంలోని ప్రతి ఒక్క వ్యాపారస్తుడికి అండగా నిలుస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముందుంటారని వ్యాపారస్తులు స్పష్టంగా పేర్కొన్నారు. వ్యాపార వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే ప్రతి మంచి నిర్ణయంలో ఎమ్మెల్యే పాత్ర కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ నగర్ బట్టల వ్యాపారస్తులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం లో బట్టల శివాజీ నగర్ బట్టల వ్యాపార సంఘం అధ్యక్షులు నమని సదయ్య, వంగ దేవేందర్, పి అంజయ్య, బూర్ల సతీష్, గోలి రంగన్న, ఆడెపు శెంకర్, ఎం రాజమల్లు, ఎం రమేష్, వంగ నవీన్, గజర్ల అరుణ్, కె సంపత్, టీ రాజమౌళి, మురళి, రాజమౌళి, సత్యం, ఎం శ్రీనివాస్, గట్టయ్య, బుక్క దుకాణ అధ్యక్షులు చింతల సదానందం ఫ్లవర్ మర్చంట్ అసోసియేషన్ మెంబర్ సతీష్ తదితరులుపాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులలో నకిలీలు?



హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికిఈ వెయిటేజీ వర్తించదు. ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులుగ్ర్భాంతికి గురయ్యారు.

# రహస్య జీవోల సంగతేంటీ

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి. తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17-18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50-60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి. అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

# మేకపాటి స్థానంలో కొత్త నేత

నెల్లూరు, : జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !



అమెరికా-ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి.

సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్దంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది.

## నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలి

### - జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల: నర్సరీలోని ప్రతి మొక్కను సంరక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలో, స్తంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు.నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు, వాటి జీవన శాతం ఎలా ఉంది, భవిష్యత్తులో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి కాలం అయినందున ఎండ తీవ్రత దృష్ట్యా నర్సరీలలో షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, సమయం ప్రకారం మొక్కలకు నీరందించాలని, సమయానుకూలంగా ఎరువులు వేసి మొక్కల ఎదుగుదలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో 100 మంది ఈజిఎస్ ఉపాధి హామీ కూలీలతో నర్సరీలలోని మొక్కలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షించాలని అలాగే పూలు, పండ్లు, ఇతర నీడ నిచ్చే మొక్కల పెంపకం కీలకమని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచి సమయానికి నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి జీవన శాతాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో పీడీ రఘువరన్, తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీ ఓ,స్థానిక సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ధాన్యంతో అన్నదాల నిరీక్షణ



నిజామాబాద్, : వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి.పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఏసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

కలవరపడుతున్న రైతులు..: ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజులక్రితమే ధాన్యంకేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు కోరుతున్నారు.వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10రోజులుఅవుతోంది. కొనుగోలుకేంద్రంఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు.ఇప్పటి వరకు ఇక్కడఈ విధమైనఏర్పాట్లు చేయ లేదు ఈడ పరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

# రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత





కర్నూలు, : వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడి బజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య ర్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీ బలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఆధిపత్య పోరు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# సర్కారీ కొలువుల్లేకపోయినా.. భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్,: ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది.ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షలమంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో4లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇదంతా చూస్తే.. హైదరాబాద్ కొలువులకు నెలవుగా మారటమే కాదు.. మహానగర స్థాయి ఏమిటన్న విషయాన్ని చెప్పకనే చెప్పేస్తుందని చెప్పాలి.

## అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా కనిపిస్తుందంటే..

# నాసా విడుదల చేసిన అద్భుత చిత్రాలు!



అంతరిక్షం నుంచి సూర్యగ్రహణం ఎలా ఉంటుందో కళ్లకు కట్టే అద్భుతమైన చిత్రాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా విడుదల చేసింది. చంద్రుడిపైకి మనుషులను పంపించే లక్ష్యంతో ఇటీవల నిర్వహించిన 'ఆర్టెమిస్-2' మిషన్ ఈ అపురూప దృశ్యాలను బంధించింది. భూమిపై చంద్రుడి నీడ (ఛాయ) ఒక పెద్ద నల్లటి మచ్చలా కదులుతున్నట్లు చూపిస్తున్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాలను చూస్తుంటే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలోని గ్రాఫిక్స్‌ను చూస్తున్నట్లుందని నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రహణ సమయంలో భూమి అంచుల వెంబడి ప్రసరిస్తున్న కాంతి, మేఘాల మధ్య నుంచి కనిపిస్తున్న రంగులు మరో గ్రహాన్ని చూస్తున్న అనుభూతిని కలిగిస్తున్నాయని శాస్త్రవేత్తలు సైతం ఆశ్చర్యపోతున్నారు. మానవులను చంద్రుడిపైకి తీసుకెళ్లే బృహత్తర ప్రయోగంలో ఆర్టెమిస్-2 మిషన్ అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా వ్యోమగాములు చంద్రుడి చుట్టూ ప్రయాణించి భూమికి తిరిగి వస్తారు. ఈ మిషన్‌లో అమర్చిన అత్యాధునిక కెమెరాల ద్వారా ఈ చిత్రాలను తీశారు. ఇవి కేవలం

అద్భుత దృశ్యాలు మాత్రమే కాదని, గ్రహణ సమయంలో భూవాతావరణంలో జరిగే మార్పులు, కాంతి ప్రసరణ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయని నాసా తెలిపింది. వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి తీసిన ఈ ఫొటోలు సాంకేతిక విజయాన్ని చాటడమే కాకుండా, విశ్వంలోని అద్భుతాలను సరికొత్త కోణంలో వీక్షించే అవకాశాన్ని కల్పించాయని నాసా ప్రతినిధులు పేర్కొన్నారు.

### పేద విద్యార్థులకు గోల్డెన్ ఛాన్స్.. 26న మెగా గ్రాండ్ టెస్ట్

చౌటుప్పల్ : ఐఐటీ-జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల పై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో రత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 న ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక ఎమ్మార్వో వీరాబాయి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ రత్నం ఫౌండేషన్ పేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణా కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఐఐటీ-జేఈఈ, నీట్, ఎంసెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

మంచి భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రత్నం ఫౌండేషన్ చైర్మన్ యు.మల్లేష్, అధ్యాపక బృందం, రామయ్య, మల్లేశం, సనా మేడం, యాదాద్రి ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు దబాటి శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వరరాగాల సుర సుర..



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల కలబోతగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమేనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నారు. 'సుర సుర' అంటూ సాగే ఈ పాటను.. సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందించారు.


జునైద్ కుమార్ అభే సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్స్‌గా నిలువనున్నాయి. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ ఈ పాటను ఆలపించగా, కాసర్ల శ్యామ్ రాశారు. ఈ సినిమాకే ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

# దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకు లకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనుల ను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయంఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి..దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


# చింతామణి సొంత కథ



శ్రీరామ్, మహిమా గుప్త జంటగా నటిస్తున్న చిత్రం 'చింతామణి సొంతకథ'. ప్రేమ్‌రాజ్ దర్శకుడు. బి.రాజీవ్‌కుమార్, రాకేష్ కర్రె, డా.ఎస్వీరావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి ప్రభుత్వ చీఫ్ విప్ అద్దంకి దయాకర్ క్లాప్ ఇవ్వగా, జీహెచ్ఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమీషనర్ వందనకుమార్ కెమెరా స్విచాన్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ డా.శ్రీనివాస్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ని అందించారు. అతిథులంతా చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కథలోని స్ట్రాంగ్ కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాతలు చెప్పారు.

కమర్షియల్ పంథాలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇదని, ఇందులో భార్యభర్తల డ్రామా ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.


# అఖిల్ వదిలేసిన స్క్రిప్ట్..
# ఈ హీరో దగ్గరకు వచ్చిందా?




టాలీవుడ్ లో హీరోలు, దర్శకుల మధ్య కథలు మారడం కొత్త విషయం కాదు. ఒక హీరో కోసం సిద్ధం చేసిన స్క్రిప్ట్ మరో హీరో దగ్గరకు వెళ్లి సినిమాగా రూపుదిద్దుకున్న సందర్భాలు గతంలో కూడా ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ అలాంటి సీన్ రిపీట్ అవుతున్నట్లు టాక్ విని పిస్తోంది. యంగ్‌హీరో అక్కినేని అఖిల్ కోసం అనుకున్న కథ.. మరో యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ దగ్గరికి వెళ్లిందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. డెబ్యూ డైరెక్టర్ అనిల్ కుమార్ ఒక కథను మొదట అక్కినేని అఖిల్‌ను దృష్టిలో పెట్టుకుని కొన్ని రోజుల క్రితం సిద్ధం చేశా రని తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై రూపొందించాలని చర్చలు జరిగినట్లు సమాచారం. కానీ కథ,కాన్సెప్ట్ పరంగా ఆసక్తికరంగా ఉన్నప్పటికీ.. సినిమా బడ్జెట్ విషయ ంలోఅప్పట్లో కొన్ని సమస్యలు తలెత్తినట్లు వినికిడి. దీంతో సినిమా ముం దుకెళ్లలేదని టాక్. కానీ దర్శకుడు అనిల్ కుమార్ మాత్రం ఆ కథను వదిలేయకుండా కొన్ని మార్పులు చేసి మళ్లీ కొత్తగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే రీసెంట్ గా స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డతో గ్రీన్ సిగ్నల్ అందుకున్నారని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో ఇటీవల సిద్ధు..మూడు కొత్త ప్రాజెక్టుల ను లైన్‌లో పెట్టిన ట్లు వార్తలు వచ్చాయి. అందులో ఒకటి అనిల్ కుమార్ తో మూవీ అని వినికిడి. దీంతో సిద్ధు కోసం అనిల్ ఎలాంటి స్టోరీ రెడీ చేశారోనన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అఖిల్ రాసుకున్న కథలో మార్పులు చేర్పులు చేసి.. ఆ స్టోరీనే సిద్ధుకు నెరేట్ చేశారని తెలుస్తోంది. యూత్ లో మంచి క్రేజ్ ఉన్న ఆయన ఇమేజ్‌కు ఆ కథ సరిపోతుందని భావి స్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అందులో నిజమెంతో తెలియకపోయి నా.. ఇప్పుడు సోషల్ మీడియాలో వార్తలు మాత్రం వస్తున్నాయి. అదే సమయంలో సిద్ధు– అనిల్ సినిమాను సితార ఎం టర్టైన్మెంట్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ నిర్మించే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. సితార ఎంటర్టైన్మెంట్స్ ఇప్పటికే యువ హీరోలతో పలు విజయవంతమైన సినిమాలు నిర్మించిన సంగతి తెలిసిందే. సిద్ధుతో కూడా సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులు రూపొందిం చింది. అందుకే ఆ కాంబి నేషన్‌పై కూడా ఆసక్తి పెరుగుతోంది. ఏదేమైనా సిద్ధుతో అనిల్ చేయ నున్నమూవీ కథ నిజంగా అఖిల్ కోసం రాసిందా? అదే స్క్రిప్ట్ ఇప్పుడు సిద్ధుదగ్గరికి వెళ్లిందా? లేక కొత్త ప్రాజెక్ట్‌గా తెరకెక్కు తుందా?అనే విషయాలపై త్వరలో స్పష్టతవచ్చే అవకాశముంది.


# రాకాలో ద్విపాత్రాభినయం మలుపు?

## అల్లు అర్జున్ రూపం వెనుక భారీ రహస్యం!



అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణే ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. "పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

# జబ్బల రవిక డిజైనర్ కోకలో మలైకా కెవ్వు కేక



బాలీవుడ్ సీనియర్ బ్యూటీ మలైకా అరోరా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోల్లో తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానుల గుండెల్లో మంటలు రేపుతోంది. ముఖ్యంగా ఆ జబ్బల రవిక (పఫ్ స్లీవ్ బ్లౌజ్), కాంబినేషన్ డిజైనర్ కోకలో మల్లా మెరిసిపోతున్న తీరు –కేక– పెట్టించేలా ఉంది. సాంప్రదాయ చీరకట్టుకు మోడ్రన్ టచ్ ఇస్తూ మలైకా చేస్తున్న ఈ ఫ్యాషన్ ప్రయోగాలు నెటిజన్లను మంత్రముగ్ధ లను చేస్తున్నాయి. ఇది గౌరి అండ్ నైనిక డిజైనర్ శారీ. ప్రస్తుతం 52 ఏళ్ల వయసులో ఉన్నా కానీ..మలైకా తన ఫిట్‌నెస్‌తో నేటి తరం హీరోయిన్లకు గట్టి పోటీనిస్తోంది. వయసు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమేనని నిరూపిస్తోంది. బికినీలు, స్విమ్ వేర్లలో ఎంతటి గ్లామర్‌ను చిందిస్తుందో.. చీరకట్టు వంటి ట్రెడిషనల్ అవతారాల్లో అంతే హుందాతనాన్ని ప్రదర్శిస్తోంది. మలైకా ఫ్యాషన్ సెన్స్ నుండి నేటితరం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా దుస్తులను ఎంపిక చేసుకోవడం.. ఏ రకమైన దుస్తులనైనా పూర్తి ఆత్మవిశ్వాసంతో ధరించడం. మలైకా వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కెరీర్ పరంగా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. అర్బాజ్ ఖాన్‌తో వివాహ బంధం ముగిసినా.. ఆ తర్వాత అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం బ్రేకప్ అయినా.. కుంగిపోకుండా తన కెరీర్‌పై దృష్టి సారించింది. వ్యక్తిగత బాధలను తన వృత్తిగత ఎదుగుదలకు అడ్డంకిగా మార్చుకోకుండా.. మరింత స్ట్రాంగ్‌గా నిలబడటం మలైకాలోని గొప్ప లక్షణం. ప్రస్తుతం ఈ బ్యూటీ తన ఫోకస్ అంతా కెరీర్, ఫిట్‌నెస్‌పైనే ఉంచుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. వెండితెరపై ఐటమ్ సాంగ్స్‌తో ఒకప్పుడు ఊపు ఊపిన మలైకా ప్రస్తుతం రియాలిటీ షోలకు జడ్జిగా రాణిస్తోంది. ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్, ఝలక్ దిఖ్లా జా, సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ వంటి పాపులర్ షోలలో జడ్జిగా వ్యవహరిస్తూ తన విలక్షణమైన శైలిని ప్రదర్శిస్తోంది. అలాగే తన సొంత షో –మూవింగ్ ఇన్ విత్ మలైకా– ద్వారా తన వ్యక్తిగత జీవితాన్ని ప్రేక్షకులతో పంచుకుంది. సినిమా ఆఫర్లు ఈ బ్యూటీని ఎందుకు వరించడం లేదనే చర్చ వస్తే.. మలైకాకేవలం స్పెషల్ సాంగ్స్ లేదా గెస్ట్ రోల్స్ కే పరిమితం కావడం.. పూర్తి స్థాయి నటిగా కంటే ఫ్యాషన్ ఐకాన్‌గా ఉండటానికే మొగ్గు చూపడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇక మలైకా అరోరా కొత్త రిలేషన్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అర్జున్ కపూర్‌తో విడిపోయిన తర్వాత ఈ భామ –స్ప్లిట్స్‌విల్లా ఠ6– ఫేమ్ సోరబ్ భేడీతో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు షికారు చేశాయి. అయితే ఈ వార్తలపై సోరబ్ స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. తామిద్దరం కేవలం స్నేహితులమని ఒకరినొకరు బాగా నమ్ముతామని పేర్కొంటూ ఈ రూమర్లకు చెక్ పెట్టారు. మలైకా కూడా ప్రస్తుతం తన ఒంటరి జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ కెరీర్‌పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.